
ప్రత్యేక అలంకరణలో పట్టిసీమ వీరేశ్వరస్వామి

శంభోశంకర..

కార్తీక మాసం రెండో సోమవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని శివాలయాల వద్ద వేకువజాము నుంచే భక్తులు కిటకిటలాడారు. స్వామికి అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలతో పాటు కార్తీక దీపారాధనలు నిర్వహించారు. పంచారామ క్షేత్రాలతో పాటు పట్టిసీమలో భక్తులు పోటెత్తారు. -6లో


ఏలూరు రామకోటి సమీపంలో పాతశివాలయంలో పూజలు



వైసీపీ జడ్పీటీసీల నిరసనలతో
హోరెత్తిన జడ్పీ

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక సమావేశం ఎన్నికల కోడ్ కారణంగా రద్దయింది. అయితే ఆ విషయం తమకు తెలియదంటూ సోమవారం వైసీపీ జడ్పీటీసీలు ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో వైసీపీ జడ్పీటీసీల నిరసనలతో జిల్లా పరిషత్ హోరెత్తింది. -7లో


రైతులతో సమావేశమైన చింతలపూడి తహసీల్దార్ ప్రమద్వర

చింతలపూడి ఎత్తిపోతలకు కదలిక

నిర్వాసిత రైతుల కొత్త డిమాండ్లు

చింతలపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎత్తిపోతల పథకానికి కదలికలు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వం ఈ పథకాన్ని మూలన పడవేయడమే కాక ఈ కాల్వ కోసం తవ్విన మట్టిని కొందరు అమ్ముకున్నారు. నిర్వాసిత రైతులకు పైసా విదల్చలేదు. నిర్వాసిత రైతుల సంఘం అప్పటి ముఖ్యమంత్రి జగన్‌ను కలిసినా ఫలితంలేదు. కూటమి ప్రభుత్వం రావడంతోనే ఈ సాగు, తాగునీటి పథకానికి నిధుల కేటాయింపు, రాష్ట్రంలో చేపట్టబోయే ఐదు ప్రాజెక్టులలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని చేర్చడంతో మెట్ట రైతుల్లో ఆశలు నింపాయి. గత నెల రోజులుగా భూ నిర్వాసిత రైతు సంఘ నాయకులను కాల్వ తవ్వే కాంట్రాక్టర్లు కలిసి మాట్లాడడం, కూటమి నాయకులు దీనిపై దృష్టి పెట్టడంతో పాటు మండలంలో యర్రగుంటపల్లి, సుబ్బారాయుడుగూడెం, కొమ్ముగూడెం, పలు గ్రామాలకు చెందిన భూనిర్వాసితులతో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రైతుల అభిప్రాయాన్ని అధికారులు సేకరించారు. ప్రాజెక్టు పనులపై ప్రభుత్వం ముందుకు రావడంతో రైతుల్లో కొంతమేర ఆశలు చిగురించాయి. భూనిర్వాసిత రైతులు కొత్త డిమాండ్లను తెరపైకి తీసుకొచ్చారు. ఇందులో ప్రధానంగా తమ భూములు ఇవ్వాలంటే ప్రస్తుతం మార్కెట్ ధర 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఉందని, అందువల్ల కనీసం ఎకరం 50 లక్షల ధర తగ్గకుండా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. మోటార్లు, బోర్లు, చెట్లు కోల్పోతున్నవారికి ప్రస్తుత ధరల ప్రకారం పరిహారం ఇవ్వాలని, కాల్వ తవ్వకాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్నవారికి గజాల్లో విలువ లెక్కించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధాన సమస్య కాల్వ పరీవాహక ప్రాంతంలో చెరువులన్నింటిలో నీటిని నింపే విధంగా డిజైన్ చేయాలని కోరారు. సమావేశంలో రైతులు పి.సోమశేఖర్, డి.కృష్ణ, పచ్చల శివ, పిడపర్తి చంద్రశేఖర రెడ్డి, వనమాల రాంబాబు, రామలింగ స్వామి, ధర్మలింగస్వామి, సత్యనారాయణ రెడ్డి, 50 మంది రైతులు పాల్గొన్నారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తహసీల్దార్ ప్రమద్వర తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట



రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటికి బడ్జెట్ కేటాయించారు. బీసీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా శిశు సంక్షేమం పాఠశాల విద్యకు తగినంత ప్రాధాన్యత కల్పించారు. నైపుణ్యాభివృద్ధికి ఎక్కువ నిధులు కేటాయిచడం వల్ల ఉద్యోగ, ఉపాధి కల్పన మెరుగుపడుతుంది. గృహ నిర్మాణం, పరిశ్రమలు, వాణిజ్యం, ఇంధన రంగం, పర్యాటక, పర్యావరణానికి పోలీసు సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు.

– పుట్టా మహేశ్ , ఎంపీ

ఆర్థిక వ్యవస్థ బలోపేతం..



గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా పతనం చేసింది. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2.9లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ మళ్ళీ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేలా ఉంది. వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్యా, ఆరోగ్యరంగాలకు అధిక కేటాయింపులు జరిగాయి. సూపర్ - 6 పథకాలకు తగినన్ని నిధులు కేటాయింపు, అందరికి ఇళ్లు నిర్మించేందుకు తగినన్ని నిధులు కేటాయించారు.

– బడేటి చంటి, ఏలూరు ఎమ్మెల్యే

పేద వర్గాల బడ్జెట్



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. పేద, బడుగు, బలహీన వర్గాల బడ్జెట్. పేదల సంక్షేమానికి ఆర్థిక వెసులుబాటు కల్పించి వారి జీవన ప్రమాణాలను పెంపొందించడమే ధ్యేయం. గత ప్రభుత్వ విధానాలు, ఆ నాయకుల అసమర్థత, వ్యక్తిగత ప్రయోజనాల కారణంగా అన్ని రంగాల్లోను ఆర్థిక విధ్వంసం జరిగింది. దీనిని గాడిలో పెట్టేలా బడ్జెట్ ఉంది.

– పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే

ఆమోదయోగ్యమైన బడ్జెట్



రాష్ట్రం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నా అన్నిరకాల ప్రజలకు ఆమోద యోగ్యమైన బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రధానంగా సంక్షేమం, ఇరిగేషన్, రోడ్లు, వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చారు. రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేశారు. రాష్ట్రానికి ఆదాయం లేక పోయిన ఇలాంటి బడ్జెట్ కూటమి ప్రభుత్వానికే సాధ్యమైంది.

– కామినేని శ్రీనివాస్, కైకలూరు ఎమ్మెల్యే

బడ్జెట్ అదుర్స్

- కీలక శాఖలన్నింటికీ ఆమోదయోగ్య కేటాయింపులు
- రహదారులకు పూర్తిస్థాయి మోక్షం
- జిల్లా-మండలాల మధ్య రహదారుల విస్తరణ
- పేదల సొంతింటి కల సాకారం దిశగా అడుగులు
- జల వనరులకు భారీ కేటాయింపులు
- ప్రాధాన్యతా క్రమంలో చింతలపూడి ఎత్తిపోతలు
- అభివృద్ధి, సంక్షేమం సమపాళ్ళు ఉండేలా కేటాయింపులు
- ప్రజాప్రతినిధుల పూర్తి స్థాయి సంతృప్తి





రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 2024-25కు గాను బడ్జెట్‌ను సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. కీలక మంత్రిత్వ శాఖలన్నింటికీ ఘనంగానే కేటాయింపులు ప్రతిపాదించారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

కీలక శాఖలన్నింటికీ బడ్జెట్‌తో మళ్ళీ జీవం వచ్చినట్టయ్యింది. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లగా ఉండాలనుకుంటున్న కూటమి ప్రభుత్వం ఆ దిశగానే కేటాయింపుల్లోను కొంత చొరవ తీసుకుంది. ఒక వైపు ఆర్థిక పతనావస్థకు చేర్చిన గత ప్రభుత్వ చేష్టలను ఒక్కొక్కటిగా అధిగమిస్తూ సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు కదిపింది. 2024-25 వార్షిక బడ్జెట్‌కు అనువుగా సరికొత్త బడ్జెట్ కేటాయింపులను రూపొందించి ఆ మేరకు సోమవారం అసెంబ్లీలో ప్రవేశ పెటారు. జలవనరులకు పెద్ద పీట వేశారు. సమాంతరంగా రహదారులు, గృహ నిర్మాణానికి అంతే ప్రాధాన్యత ఇచ్చారు. పర్యాటకం, ఇతర రంగాలకు సంతృప్తికర రీతిలోనే బడ్జెట్‌లో అంకెలు కనిపిం చాయి. ఇది అత్యద్భుత బడ్జెట్‌గా ఎంపీ, ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు.

జల వనరుల శాఖకు బడ్జెట్‌లో అగ్ర తాంబూలం కనిపించింది. ఈ శాఖకు 16,705 కోట్లను కేటాయించారు. ఇప్పటికే ప్రధాన మధ్యతరహా, చిన్నతరహా ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగానే అడుగులు వేశారు. చింతల పూడి ఎత్తిపోతల పథకానికి ప్రాధాన్యత ఇచ్చినట్టు స్పష్టమైంది. రాష్ట్రంలోని మిగతా ఎత్తిపోతల పథకాల్లో భాగంగానే ఈ ఎత్తిపోతలను చేర్చా రు. ఇప్పటికే చింతలపూడి ఎత్తిపోతల పథకం రెండుగా విభజించి మొదటి దశను 2026 నాటికి పూర్తి చేయాలని సంకల్పించారు. ఈ దిశగానే ఉమ్మడి పశ్చిమగోదావరి ఏజెన్సీ ప్రాంతం మీదుగా సాగే ఎత్తిపోతల కాల్వ పనులు, మార్గమధ్యలో జలాశయాల నిర్మాణంకు అనువుగా ఈ కేటాయింపులతో ఊపిరి వచ్చినట్టయ్యింది. వాస్తవానికి చింతలపూడి ఎత్తిపోతల పథకం కింద తొలుత 2 లక్షల 20 వేల ఎకరాలకు నీరు ఇవ్వాలని సంకల్పించినా, ఆ తదుపరి పొరుగున ఉన్న ఉమ్మడి కృష్ణలో వివిధ నియోజకవర్గాలకు తాగు, సాగు నీరును ఇవ్వాలని సంకల్పించి దీని నిమిత్తం అంచనా వ్యయాన్ని సుమారు 4,800 కోట్లకుపైగా సవరించారు. తొలుత చింతలపూడి వరకు కొంత కాల్వ నిర్మాణం సాగింది. అక్కడక్కడ భూ సేకరణ వివాదాలు కొనసాగుతున్నాయి. మరి కొన్ని కోర్టు గడప తొక్కాయి. భూమి ధర చెల్లింపులో తమకు న్యాయం జరగాలని రైతులు ఎప్పటి నుంచో పట్టుపడుతున్నారు. వైసీపీ హయాంలో ఈ విషయాన్ని పక్కన పెట్టేశారు. ఇప్పుడు దీనిని మళ్ళీ ఓ గాడిన పెట్టేందుకు మెట్ట ప్రాంతాన్ని గోదావరి జలాలతో తడిపేందుకు అనువైన పరిస్థితులు సృష్టించేందుకు బడ్జెట్‌లోను తగిన కేటాయింపులు చేయనున్నారు. ఈ పథకం పూర్తయితే మెట్ట, ఏజెన్సీ ప్రాంతంలో తాగు, సాగు నీటికి ఇబ్బందులు ఉండవు. అందుకే చింతలపూడి ఎత్తిపోతలను కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తిచేసేందుకు అవసరమైన నిధులను కేటాయిస్తున్నారు. ఇప్పటికే కొన్నేళ్లుగా కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలను తీర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు తాజాగా బడ్జెట్‌లోను ఎత్తిపోతలకు ప్రాధాన్యత ఇచ్చే దిశగా మొదటి వరుసలోకి చేర్చడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో మధ్యతరహా, మైనర్ ఇరిగేషన్‌కు కూడా కేటాయింపులు సంతృప్తి కరంగానే ఉన్నాయి. జిల్లాకు సంబంధించి తమ్మిలేరు, ఎర్రకాల్వ జలాశయాలు, వీటి ఆధునికీకరణ పనులను పూర్తి చేయడానికి అనుకూలంగానే కేటాయింపులు పరిగణనలోకి తీసుకున్నారనేది స్పష్టమవుతుంది. ఇదేక్రమంలో ఎక్కడా డెల్టా ఆధునికీకరణ పనులు, నిధులు కేటాయింపు ప్రస్తావించినట్టు కనిపించలేదు. జల వనరుల శాఖ కింద కేటాయించిన మొత్తం నిధులను మాత్రమే ఉటంగించారే తప్ప విడివిడిగా ఏఏ పనులకు ఎంతనేది బహిర్గతం కాలేదు.

గృహ, రహదారులకు ఊరట

ఈ బడ్జెట్ కేటాయింపుల్లో ప్రత్యేకించి గృహ నిర్మాణశాఖకు 4 వేల 12 కోట్లు కేటాయించినట్టు చూపించారు. వాస్తవానికి ఇప్పటికే ఎక్కడికక్కడ నిలిచి పోయిన గృహాలను పూర్తి చేయడానికి, టిడ్కో ఇళ్లను వీలైతే ఈ డిసెంబరునాటికి పేదలకు అందించేందుకు ప్రభుత్వం సన్నాహాల్లో ఉంది. ఈ క్రమంలోనే 25 లక్షల ఇళ్లు, ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ఈ కేటాయింపులు తోడ్పడతాయి. సమాంతరంగా ప్రధాన మంత్రి అవాస్ యోజన (పీఎంఏవై), ఎన్టీఆర్ నగరాలు కింద ఎక్కడికక్కడ విస్తృతంగా గృహ నిర్మాణం చేసేందుకు సంకల్పించి నిధులు కేటాయించారు.

రహదారులకు మహర్దశ

ఇప్పటివరకు జిల్లాలో రోడ్లపై ప్రయాణించి ప్రాణాలు కోల్పోవడమో, ఆసుపత్రుల పాలు కావడమో వంటి అనేక సంఘటనలు జరిగాయి. దీనిని అధిగమించేందుకు వీలుగా గుంతల రహిత రహదారులు నినాదంగా ఎంచుకుని ఆ మేరకు ఇప్పటికే నిధులు మంజూరు చేశారు. బడ్జెట్‌లో తాజాగా 'సరైన రహదారులు, ప్రయాణంకు అనుకూలంగా..' అనే నినాదంతో 9 వేల 554 కోట్లు బడ్జెట్‌లో చూపించారు. ఈసారి న్యూడవలప్‌మెంట్ బ్యాంక్ సహకారంతో జిల్లా కేంద్రం, మండలాలకు అనుసంధాన మార్గాలు పటిష్టం, అన్ని మండలాల మధ్య రెండు లైన్ల రహదారుల నిర్మాణానికి వీలుగా సరికొత్త ప్రణాళిక రూపొందించారు. తాజా బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో ఈ పనులకు ప్రాధాన్యత ఇస్తారు. పంచాయతీరాజ్ విభాగంలో రోడ్లకు మరమ్మతులు, ఇతరత్ర పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూనే ఆ మేరకు నిధుల కేటాయింపు బడ్జెట్‌లో చూపించారు. నిరుద్యోగులకు ఊటర కలిగించేలా మెగా డీఎస్సీని అమలు చేస్తామని ప్రభుత్వం మరోసారి భరోసా ఇచ్చింది. సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ కేటాయింపులు జరిగాయి. అన్నక్యాంటీన్లు నిరంతరం కొనసాగించేందుకు వీలుగా కేటాయింపులు ఇచ్చారు. విద్యారంగం మరింత రాణించే దిశగా ఇలాంటి ప్రయత్నాలే జరిగాయి. పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులన్నీ సంతృప్తికరంగా ఉన్నట్టు ఎమ్మెల్యేలు అభిప్రాయపడుతున్నారు.

ప్రజలు హర్షించే బడ్జెట్



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలు హర్షించేదిగా ఉంది. ప్రజల ఆకాంక్ష మేరకు విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి రోడ్లు ఆర్ అండ్‌బీ రోడ్లకు నిధుల కేటాయింపు అభివృద్ధిని సూచిస్తోంది. చింతలపూడి ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వం దృష్టిపెట్టిం ది. రైతులకు నష్టపరిహారం విషయంలో న్యాయం జరిగేలా నా వంతు కృషి చేస్తాను.

– సొంగా రోషన్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే

సూపర్ సక్సెస్ బడ్జెట్..



ఎన్డీయే కూటమి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ సూపర్ సక్సెస్ బడ్జెట్. ఇది అన్నివర్గాల, ప్రజలకు ఆమోదయోగ్యమైనది. అన్నిరంగాలకు అనుకూలమైన బడ్జెట్. వైసీపీ హయాంలో కుంటుపడిన పంచాయతీ వ్యవస్థ తిరిగి గాడిన పడుతుంది. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసింది. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి అని మరోసారి రుజువైంది.

– చింతమనేని ప్రభాకర్ , దెందులూరు ఎమ్మెల్యే

అందరూ హర్షించేలా..



అన్ని వర్గాల వారు హర్షించదగిన బడ్జెట్ ఇది. పాఠశాల విద్యలో నాణ్యత, సదుపాయాలు, 2029నాటికి పేదలందరికి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కూటమి ప్రభుత్వం సంకల్పం. అర్హులకు ఇళ్లు, ఇళ్ల పట్టాలు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకోవడంతో ప్రభుత్వం ప్రజలకు మరింత దగ్గరైంది. బీసీ సామాజిక వర్గం బడ్జెట్ లో తమకు ఇచ్చిన ప్రాముఖ్యతపై హర్షం వ్యక్తం చేస్తోంది.

– చిర్రి బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే

రేపు జిల్లా నీటిపారుదల మండలి సమావేశం

ఏలూరుసిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం ఈనెల 13వ తేదీ బుధవారం ఉదయం 11గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జరుగుతుందని ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ సీహెచ్ దేవప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గోదావరి పశ్చిమ డెల్టాకు రబీ సీజన్‌కు సంబంధించి నీటి లభ్యత, ఆయకట్టు గురించి, 2024-25 రబీ పంట అనంతరం కాల్వల మూసివేయు తేదీ నిర్ణయం, తదితర అంశాలను చర్చిస్తారన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, నవంబరు 11: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందిన ఫిర్యాదుల పరిష్కారాన్ని నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 236 దరఖాస్తులు స్వీకరించినట్టు తెలిపారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు తదితర అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై వేదిక నుంచే జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, డివిజన్, మండలస్థాయి అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశించారు. అర్జీ రీ ఓపెన్ కాకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

సావనీర్ ఆవిష్కరణ..

ఏలూరుసిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో రైతు గ్రూపులకు, రైతులకు సమాచార హక్కు చట్టం అవగాహన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలో వివిధ మండలాల్లో వ్యవసాయ శాఖ అధ్వర్యంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టం -2005 అవగాహనా కార్యక్రమాలకు సంబంధించి ఫొటోలు, ప్రచురణలతో రూపొందించిన సావనీర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్‌బాషా, జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్‌డీఏ ఆర్ విజయరాజు, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హరోం హర

శివ నామస్మరణతో మార్మోగిన శివాలయాలు




భీమవరంలో దీపాల పూజలో భక్తులు..పట్టిసీమ వీరేశ్వరస్వామికి అభిషేకం



ఏలూరులోని ఫత్తేబాద చాడేశ్వరి రామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు

భీమవరం టౌన్, పాలకల్లు అర్బన్ పోలవరం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం రెండో సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పంచారామ క్షేత్రాలు, పట్టిసీమ క్షేత్రానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. పంచారామ క్షేత్ర మైన గునుపూడి సోమేశ్వరస్వామి తెల్లవారుజామున ఆలయ అర్చకులు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించిన అనంతరం దర్శనం కల్పించారు. స్వామివారికి 9 లక్షల 58 వేల 732 రూపాయలు ఆదాయంగా వచ్చిందని ఈవో రామ కృష్ణంరాజు తెలిపారు. స్వామివారిని దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వి రమేష్ బాబు దర్శించుకున్నారు. సోమేశ్వరస్వామి నిత్యన్నదానం ట్రస్టు ఆధ్వర్యంలో మానేపల్లి వారి కుటుబం, కురిశేటివారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో భక్తులకు అన్నదానం చేశారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు) అన్నసమారాధన ప్రారంభించారు. వన్‌టౌన్ సీఐ నాగరాజు పర్యవేక్షించారు.

ఓం నమశివాయ నామస్మరణతో క్షీరా రామ లింగేశ్వరస్వామి ఆలయం మారు మోగింది. వివిధ ప్రాంతాల నుంచి సుమారుగా 30 వేల మంది వరకూ స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాల సమాచారం. రేపాక వారి సత్రంలో భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. క్షీరా రామ లింగేశ్వర స్వామిసేవాసమితి,యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు బాదం పాలు అందించారు. సోమవారం మధ్యాహ్నం ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఎస్పీ మురళీ కృష్ణ ఉన్నారు.

పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.తెల్లవారుజామునే ఫెర్రీ రేవులో స్నానాలాచరించి గోదావరిలో కార్తీక దీపాలు వదిలారు. అనంతరం వీరేశ్వరస్వామిని



దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న క్షేత్ర పాలకుడు భావన్నారాయణ స్వామి భద్రకాళీ, తాండవ భద్రుడు, నవగ్రహాలు, కాలభైరవడు, సీతారామచంద్రస్వామి, ఆంజనేయులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంచారామాలను దర్శించుకున్న అఘోరీ

పంచారామ క్షేత్రాలైన గునుపూడి సోమేశ్వరస్వామి, క్షీరా రామ లింగేశ్వర స్వామిలను సోమవారం సాయంత్రం అఘోరీ దర్శించుకున్నారు. ఆమె పర్యటనలు ఇటీవల కొంత వివాదస్పదంగా ఉండటంతో దేవాలయం వద్ద ఉన్న పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆమె దర్శనం చేసుకుని వెళ్ళేవరకు జాగ్రత్తలు వహించారు.





గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు.. స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన అఘోరి.. క్షీరారాముని దర్శించుకున్న ఐజీ అశోక్ కుమార్



చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.2.04 కోట్లు

ద్వారకాతిరుమల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశునికి హుండీల లెక్కింపు ద్వారా మంచి ఆదాయం సమకూరింది. కేవలం 21 రోజుల కాలానికి గాను నగదు రూపేణా రూ2.04 కోట్ల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సత్యన్నారాయణమూర్తి తెలిపారు. ప్రమోద కల్యాణమండప ఆవరణలో సోమవారం భద్రతాఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపు నిర్వహించారు. 2,04,67,691 రూపాయల నగదుతో పాటుగా భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 234 గ్రాముల బంగారం, 4.998 కేజీల వెండి లభించినట్లు ఈవో వివరించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (8), 2000(9)తో పాటు విదేశీ కరెన్సీ లభించింది.

అలరించిన శోభారాజ్ బృంద నగర సంకీర్తన



ద్వారకా తిరుమల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న క్షేత్రంలో అన్నమాచార్య భావనా వాహినీ వ్యవస్థాపకురాలు, ప్రముఖ గాయని డాక్టర్ శోభారాజ్ ఆధ్వర్యంలో నగర సంకీర్తనను నిర్వహించారు. ఆగమ విద్యార్థులు, శోభారాజ్ శిష్య బృందం పాల్గొన్నారు. ముందుగా ఆలయ పాదుకామండపం వద్ద స్వామివారి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేకపూజలు జరిపారు. ముందుగా గజలక్ష్మి నడుస్తుండగా ఆగమ విద్యార్థులు శ్రీవారి చిత్రపటం పట్టుకుని శిష్యబృందం, శ్రీవారి కీర్తనలను ఆలపిస్తూ క్షేత్రంలో తిరిగారు.ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించారు. ఆలయ ప్రాంగణంలో అన్నమయ్య కీర్తనలను ఆలపించారు.

రేపు శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం.. చురుగ్గా ఏర్పాట్లు



ద్వారకాతిరుమల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన నృశింహ సాగరం (సుదర్శన పుష్కరిణి)లో బుధవారం రాత్రి తెప్పోత్సవ నిర్వహణకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. పుష్కరిణిని సుందరీక=రించేందుకు, అందులోని తూడును మొత్తం సిబ్బంది తొలగించారు. సాగర పరిసరాలను విద్యుత్ దీపతోరణాలతో అలంకరిస్తున్నారు. సాగరం చుట్టూ ఫెన్సింగ్ నిర్మించారు. పుష్కరిణి మధ్యలో ఉన్న మండపాన్ని రంగులతో ముస్తాబు చేస్తున్నారు. పుష్కరిణిలోని మురుగు నీటిని తొలగించి పైపుల ద్వారా కొత్తనీటి ని నింపారు.ఉభయనాంచారులతో కొలువైన శ్రీవారు బుధవారం సాయంత్రం తొళక్క వాహనంపై తిరువీధుల్లో ఊరేగి తర్వాత రాత్రి 8 గంటల ప్రాంతంలో పుష్కరిణి వద్దకు చేరు కుంటారు. అనంతరం తెప్పోత్సవం జరుగుతుందని భక్తులు రావాలని ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి కోరారు.



సైకిళ్లపై శబరిమలై యాత్ర

పాలకొల్లు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు అయ్యప్పస్వామి ఆలయం వద్ద గల గురుపీఠంలో గురుస్వామి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 17 మంది అయ్యప్ప భక్తులు ఆలయం వద్ద నుంచి సైకిళ్లపై శబరిమల బయలు దేరారు. సుమారు 15 నుంచి 18 రోజుల్లో శబరిమలైకి చేరుకునే విధంగా ప్రణాళిక చేసుకున్నట్లు గురుస్వామి తెలిపారు.



సందర్శకులతో కిటకిటలాడిన బౌద్ధారామాలు

కామవరపుకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) :కార్తీకమాసం ప్రతీ సోమవారం కామవరపుకోట మండలం జీలకర్రగూడెం గట్టుపై గల బౌద్ధారామాలను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సందర్శించుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. గట్టుపై గల బౌద్దుల చైత్యాలు, బౌద్ధగుహలు, ప్రాచీన కట్టడాలు, పాలరాతి బౌద్ధ స్థూపాన్ని సందర్శించారు. గట్టుపై గల ఏకశిలా నిర్మితమైన కొండల్లో మలిచిన ధర్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మహిళలు సంతాన ప్రాప్తికై దీక్షలు నిర్వహించారు. దాదాపు వెయ్యి మంది సందర్శించినట్లు అంచనా. సందర్శకులతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది.

నిశ్శబ్ద న్యూమోనియా




ఏలూరు క్రైం/ భీమవరం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ఎక్కువగా గుండెకు సంబంధించిన వ్యాధులతో మరణించే వారి సంఖ్య తరువాత న్యూమోనియా రెండో స్థానంలో ఉంది. ఎక్కువగా చిన్నపిల్లల్లో ఈ వ్యాధి కనిపిస్తుంది. చిన్న పిల్లల్లో 5 సంవత్సరాల లోపు మరణించే వారిలో 50 శాతం ఈ వ్యాధితోనే మరణిస్తున్నారు. కొద్ది పాటి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఈ వ్యాధి నుంచి దూరం కావచ్చు. నేడు ప్రపంచ న్యూమోనియా దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కథనం

న్యూమోనియా అంటే

ఊపిరితిత్తులు గాలి సరిగా పీల్చుకోవడానికి వీలులేకుండా అక్కడ తేమ ఏర్పడడం వల్ల ఊపిరి పీల్చుకోలేక ఇబ్బంది పడుతూ ఉంటారు. పెద్దల్లో అయితే ఆయాస పడుతూ ఉంటారు. పిల్లల్లో అయితే డొక్కలు ఎగరవేస్తూ ఉంటారు. శ్వాస పీల్చుకోవడం ఎంతో బాధాకరంగా ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు ప్రకారం భారతదేశంలో న్యూమోనియా వ్యాధి నిర్ధారణ అయి మరణించిన వారు 10.2 శాతం ఉన్నారు. వివిధ వ్యాధితో మరణించిన పిల్లల్లో 15 శాతం ఈ వ్యాధితోనే మరణించారు. ఇది ఎక్కువగా చిన్నపిల్లలు, 60 ఏళ్ళ పైబడిన వారిలో కనిపి స్తుంది. శీతాకాలం, వేసవి కాలంలోనూ ఊపిరితిత్తులకు తేమ ఎక్కువై శ్వాసతీసు కోవడం కష్టంగా మారుతుంది. అంతేకాకుండా దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి కూడా ఈ వ్యాధి వస్తుంది. ధూమ పానం అలవాటు ఉన్నవారికి, వారి కుటుంబ సభ్యులకు కూడా వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంది. వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ వ్యాధి ప్రబలు తుంది. ఇంట్లో ఉండే పెంపుడు జంతువులు అయిన పిల్లి, కుక్కల వల్ల సోకే ప్రమాదం ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ వ్యాధిబారినపడి ఆసుపత్రికి వెళ్ళే వారి సంఖ్య ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కలిపి వెయ్యి నుంచి పదిహేను వందల మంది ఉంటున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి రోజుకు 100 మంది వరకూ ఈ వ్యాధి గ్రస్తులు వస్తున్నారని ఆసుపత్రి రికార్డుల ప్రకారం తెలుస్తోంది.

వ్యాధి లక్షణాలు



జ్వరం, కఫంతో కూడిన దగ్గు, చలి, వణుకు ఉండడం, ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో కష్టంగా ఉండడం, బలహీనంగా, నీరసంగా శక్తి తక్కువగా ఉండడం అనిపించడం, వికారం, వాంతులు, విరేచనాలు, గందరగోళ పరిస్థితి కనిపించడం. సాధారణ ఉష్ణోగ్రత కంటే తక్కు వగా ఉండడం వంటి లక్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి. చిన్న పిల్లల్లో అయితే నోరు తెరిచి గాలిపీల్చుకోవడం, డొక్కలు ఎగురవేయడం స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా నవజాతి శిశువులు రెండు నెలలోపే ఈ వ్యాధి ఎక్కువగా వస్తూ ఉంటుంది. ఒకరి నుంచి ఒకరికి ఈ వ్యాధి సోకుతుంది. తుమ్మడం వల్ల క్రిములు గాలిలో కలవడం, ఆ గాలిని వేరే వారు పీల్చుకోవడంతో వ్యాధి ప్రబలే అవకాశం ఉంది.

మరణాల్లో రెండోస్థానం

కొద్దిపాటి జాగ్రత్తలతో వ్యాధికి దూరం

పిల్లలు, వృద్ధులు జాగ్రత్త

నేడు ప్రపంచ న్యూమోనియా దినోత్సవం



జాగ్రత్తలు అవసరం

రెండు సంవత్సరాలలోపు పిల్లలకు న్యూమోనియా ఎక్కువగా ఉంటుంది. పిల్లలకు నిర్ధిష్టమైన సమయంలో అవసరమైన వ్యాక్సిన్లు వేయించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెంచి వ్యాధులు రాకుండా కాపా డుకోవచ్చు. ఆరు నెలల వరకూ తల్లి పాలు ఖచ్చితంగా ఇస్తే బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. పొగకు దూరంగా ఉండడం, పౌష్టికాహార లోపాన్ని నిరోధించడం, రద్దీ ప్రదేశాల్లో ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలి. సాధారణంగా వృద్ధుల్లో అయితే తరచుగా వైద్యుల వద్దకు వెళ్ళి వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎక్స్‌రే మరికొన్ని రక్త పరీక్షల ద్వారా ఈ వ్యాధిని గుర్తిస్తారు. వ్యాధి స్టేజీని బట్టి వైద్యం ఉంటుది.. ఫస్ట్ స్టేజీలో ఉంటే యాంటీ బయోటిక్స్ ద్వారా నయం చేసే అవకాశం ఉంటుంది. అదే థర్డ్ స్టేజీలో ఉంటే తప్పనిసరిగా వైద్యుల సంరక్షణలో ఉండి వైద్యం చేయించుకోవలసి ఉంటుంది.

జాగ్రత్తలతోనే దూరం



న్యూమోనియా వ్యాధి సోకకుండా ఉండాలంటే పరిశుభ్రత ఎంతో ముఖ్యం. ఇళ్లల్లో దుమ్ము, ధూళి లేకుండా చూడాలి. వాహనాలపై ప్రయాణించే వారు మాస్క్ ధరించాలి. జ్వరం, ఆయాసం, దగ్గు, ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉందంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. శీతాకాలంలో గోరు వెచ్చని నీరు తాగాలి. కుక్కలు, పిల్లలు వంటి వాటికి దూరంగా ఉండాలి. వ్యాధిగ్రస్తులకు యాంటీబయోటిక్ ఇంజక్షన్ ద్వారా ఐదు నుంచి 8 రోజుల్లో తగ్గిపోతుంది. పిల్లలో అయితే మూడు వారాల లోపు తగ్గిపోతుంది. పొగ తాగేవారికి దూరంగా ఉండాలి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలి. ఎప్పుడైతే వ్యాధినిరోధక శక్తి తగ్గుతుందో ఈ వ్యాధి ప్రబలే అవకాశం ఉంది. మనం తీసుకునే జాగ్రత్తలతోనే మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

- డాక్టర్ ఎం.సుమన్, అత్యవసర విభాగపు వైద్య నిపుణులు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఏలూరు

వృద్ధులకు ఎక్కువగా వచ్చే అవకాశం..



న్యూమోనియా వ్యాధి ఎక్కువేగా పెద్దలకు వచ్చే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలిక రోగులు జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకుంటే మంచిది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఏ మందులు పడితే అవి వాడటం మంచిది కాదు. వ్యాధి తీవ్రత పెరిగితే ఇబ్బందులు తప్పవు.. అందుకే జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా బయటకు వెళ్తుంటే తప్పనిసరిగా మాస్కు ధరించటం, ఇంటికి రాగానే చేతులను శుభ్రంగా వాష్ చేసుకోవటం చాలా మంచిది. వైరల్ న్యూమోనియాలు ఎక్కువగా ఉన్నాయి.

డాక్టర్ ఎన్.భార్గవ రామ్, ఊపిరితిత్తులు, శ్వాస కోశ వ్యాధుల వైద్య నిపుణుడు, భీమవరం హస్పటల్స్



ఆకివీడులో ఆదర్శంగా అన్న క్యాంటీన్

పేదలకు ఉచిత భోజనం

ఆకివీడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అన్నం పరబ్రహ్మస్వరూపం. పట్టెడన్నం కోసం అందరం కష్టపడుతుంటాం. పేదల ఆకలి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ మాజీ కన్వీనర్ గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు ఆర్థిక సహాకారంతో సుమారు రోజుకు 400 మంది పేదలకు ఉచితంగా పసందైన వంటకాలతో భోజనం అంది స్తున్నారు. సత్యనారాయణరాజు తండ్రి వెంకట సుబ్బరాజు దగ్గర నుంచి పార్టీకి అండగా ఉం టూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పార్టీ చేపట్టే ప్రతీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. సత్యనారాయణ రాజు ఇటీవల మంగళగిరిలో సీఎం చంద్రబాబును కలిసి సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్ళారు.






హోరాహోరీగా అంతర్ యూనివర్శిటీ జూడో పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం డీఆర్ గోయెంకా కళాశాలలో సోమవారం నన్నయ్య యూనివర్శిటీ అంతర్ కళాశాలల జూడో పురుషులు, మహిళల పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను వైస్‌ప్రిన్సిపాల్ ప్రసాద్ ప్రారంభించారు.




తాడేపల్లిగూడెం, ఏలూరుల్లో హీరో వరుణ్‌తేజ్ సందడి

మట్కా చిత్ర యూనిట్ సందడి

ఏలూరు రూరల్/ తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరుణ్‌తేజ్ హీరోగా కరుణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన మట్కా సినిమా ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా సోమవారం సాయంత్రం హీరో వరుణ్‌తేజ్, హాస్యనటుడు రాజేష్, ఏలూరులో సందడి చేశారు. పాత బస్టాండ్ దగ్గర నుంచి నడుచుకుంటూ కొత్త బస్టాండు సమీపంలో ఉన్న ఎస్వీసీ థియేటర్‌కు విచ్చేశారు. సినిమా ట్రైలర్‌ను ప్రేక్షకులతో కలిసి తిలకించారు. కొద్దిసేపు సినిమాలోని డైలాగులు చెప్పి అలరించారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ మట్కా చిత్రం విభిన్నంగా ఉంటుందని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆదరిస్తుందన్నారు. పాత బస్టాండు నుంచి నడుచుకుంటూ మధ్యమధ్యలో అభిమానులను పలుకరిస్తూ వరుణ్‌తేజ్ సందడి చేశారు.సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఎగబడ్డారు. తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో సందడి చేశారు. తనకు పశ్చిమ గోదావరి జిల్లా అంటే ఎంతో అభిమానమన్నారు. మన సొంత ప్రాంతం అంటే ఎవరికైనా ఇదే ఫీలింగ్ ఉం టుందన్నారు. కళాశాల అధ్యక్ష కార్య దర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ రాష్ట్ర వాలీబాల్ టీంలో పోసియ్య



ఎంపికైన టీం సభ్యులతో పోసియ్య

పెంటపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సర్వీసెస్ రాష్ట్ర వాలీబాల్ టీంలో పెంటపాడు పోస్టు బేసిక్ పాఠశాలలో బయాలజీ టీచర్‌గా సేవలందిస్తున్న పోసియ్య ఎంపికయ్యారు. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ 2024-25 జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఈ నెల 9వ తేదీన విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలో నిర్వ హించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టు పోటీలలో పోసియ్య ఎంపికయ్యారు. త్వరలో జాతీయ స్థాయిలో పూణెలో జరగబోయే వాలీబాల్ పోటీలలో రాష్ట్రానికి చెందిన 12 మంది టీంలో పోసియ్య ఒకరు. ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, టీవీ రామకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ కళింగ లక్ష్మణరావు, హెచ్ఎం రాజేష్ అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా

ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ

ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 650 మంది ఎన్‌సీసీ కేడెట్లకు ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు నల్లజర్లలోని ఏకేఆర్‌జీ ఉన్నత పాఠశాల మైదానంలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు 19 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే తెలిపారు. 2026లో ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఉమ్మడి జిల్లా నుంచి కెడెట్ల ప్రాబబుల్స్‌ను ఎంపికచేయడంతోపాటు, వివిధ రకాల శిక్షణలు ఇస్తామని వివరించారు. వచ్చే ఏడాది జరుగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు ఎన్‌సీసీ కెడెట్లు ఎంపికయ్యారని, వీరికి ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తున్నారన్నారు.

రిటైర్డ్ మున్సిపల్ టీచర్ల పీఎఫ్ చెల్లింపునకు ఉత్తర్వులు

ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా శాఖ పరిధిలోకి మున్సిపల్ పాఠశాలలను విలీనం చేసిననాటి నుంచి ఉద్యోగ విరమణ చేస్తున్న మున్సిపల్ టీచర్లకు ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) చెల్లించడంలో ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగింది. ఇందుకు సంబంధించి పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని తెలుగుదేశం పార్టీ అనుబంధ ఉపాధ్యాయ సంఘం నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్టీఏ) నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, సాయి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు కార్పొరేషన్, మున్సిపాల్టీల వద్ద పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ ప్రతిపాదనలకు నిధులు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినందున ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ చర్యలు చేపట్టాలని సంఘ జిల్లా చైర్మన్ నెరుసు రాంబాబు డిమాండ్ చేశారు. గతేడాది జూలై నుంచి ఈ ఏడాది మే నెల వరకు నగరపాలక సంస్థలో ఎనిమిది మంది ఉపాధ్యాయులు రిటైర్ అయ్యారని, వీరందరికీ పీఎఫ్ వెంటనే చెల్లించాలని కోరారు.

టీచర్లకు శిక్షణ నాన్ రెసిడెన్షియల్లోనేనా..?

18 నుంచి మూడోవిడతకు సన్నాహాలు

ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాయకత్వ లక్షణాలపై హెచ్‌ఎంలకు, ఎఫ్ఎల్ఎన్ పేరిట ఎస్జీటీలకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో మూడో విడత శిక్షణ ఈ నెల 18 నుంచి ఆరు రోజుల పాటు ఇవ్వడానికి నిర్ణయించారు. శిక్షణకు ఎంపిక చేసిన హెచ్‌ఎంలు, ఎస్జీటీల జాబితాలను సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయ వర్గాలు విడుదల చేస్తాయి. జిల్లాకు సంబంధించి అగిరిపల్లిలోని హీల్ ప్యారడైజ్ స్కూలులో నిర్వహిస్తోన్న శిక్షణ తరగతులకు హాజరైన ఉండి మండలానికి చెందిన ఓ హెచ్‌ఎం ఇటీవల గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందడంతో, ఆ సంఘటనపై ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో నిలిపివేసిన విషయం విదితమే. మరోవైపు ఇకమీదట ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణ తరగతులను నాన్-రెసిడెన్షియల్ విధానంలోనే ఆయా జిల్లాల్లోనే నిర్వహిస్తామని పాఠశాల విద్య ఉన్నతాధికారులు హామీ ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే మూడోవిడత నిర్వహించనున్న శిక్షణపై సందిగ్ధత నెలకొంది. దీనిపై సమగ్రశిక్ష అధికార వర్గాలను వివరణ కోరగా తమవద్ద ఎటువంటి సమాచారం లేదని పేర్కొన్నాయి.

అంగన్వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్స్

ద్వారకాతిరుమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు, కౌమార దశలోని బాలికలకు పోషకాహార లోపం నివారణకు అంగన్వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేస్తున్నామని సీడీపీవో పి.బ్యూలా తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం అంగన్వాడీ 2.0 సమీకృత పోషకాహార మద్దతు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఈ కిచెన్ గార్డెన్స్ ద్వారా కూర గాయలు, ఆకు కూరలు, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా పెంచడం కోసం ఉద్యాన శాఖ నేచురల్ ఫామింగ్ వారి సహాయ సహకారాలు తీసుకుంటామన్నారు. పిల్లల అభివృద్ధిని ప్రోత్సహించేందుకు శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయాన్ని సాధిస్తామన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ కె.రాజు, ఉద్యానశాఖ అధికారి దేవదానం, నేచురల్ ఫార్మింగ్ మండలాధికారి సుబ్బారావు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

వైసీపీ జడ్పీటీసీల నిరసనలతో

హోరెత్తిన జడ్పీ

- సమావేశం రద్దయిన విషయం తమకు తెలియదన్న ప్రజాప్రతినిధులు
- మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారని జడ్పీ సీఈవోను చుటుముట్టి నిలదీత
- జడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ.. ప్రత్యేక సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి
- ఎన్నికల కోడ్ అనంతరం సమాచారం ఇచ్చి సమావేశం నిర్వహిస్తాం.. కలెక్టర్
- నిరసన విరమించిన వైసీపీ జడ్పీటీసీ సభ్యులు


రాత పూరకంగా తేదీ చెప్పాలని జడ్పీ సీఈవోను మీటింగ్ హాల్లో చుట్టుముట్టిన వైసీపీ జడ్పీటీసీలు

ఏలూరు సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక సమావేశం ఎన్నికల కోడ్ కారణంగా రద్దయింది. అయితే ఆ విషయం తమకు తెలియదంటూ సోమవారం వైసీపీ జడ్పీటీసీలు ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో వైసీపీ జడ్పీటీసీల నిరసనలతో జిల్లా పరిషత్ హోరెత్తింది. ఈ నెల 8న స్టాండింగ్ కమిటీల సమావేశం నిర్వహించి, ఇప్పుడు ప్రత్యేక సమావేశానికి ఎన్నికల కోడ్ ఏమిటని పలువురు జడ్పీటీసీలు ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఇటువంటి సమావేశాలు నిర్వహించవద్ద కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక సమావేశాన్ని రద్దు చేశామని, ఈ విషయాన్ని జడ్పీటీసీలకు సోమవారం రాత్రి తెలిపామని జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఎప్పుడు ఈ ప్రత్యేక సమావేశం నిర్వహించేది రాత పూరకంగా తేదీ చెప్పాలని కోరారు. సమావేశ తేదీ చెప్పలేమని అన్నారు. దీంతో జడ్పీ సీఈవో సమాధానాలు రుచించకపోవటంతో వైసీపీ జడ్పీటీసీలు జడ్పీ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకరంగా నినాదాలు చేసుకుంటూ కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి మీ కోసం కార్యక్రమంలో ఉన్న కలెక్టర్ కె.వెట్రిసెల్విని కలిశారు. ఎన్నికల కోడ్ అనంతరం జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని, సమావేశ సమయం ఉదయం 9 గంటలకు కాకుండా 11 గంటలకు నిర్వహించాలని వారు కోరారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పడంతో జడ్పీటీసీల నిరసన కార్యక్రమం ముగిసింది. ఈ నిరసన కార్యక్రమంలో 35 మంది జడ్పీటీసీల వరకు పాల్గొన్నారని చెబుతున్నారు.

తెలియదనడం సరికాదు

జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్


విలేకర్ల సమావేశంలో మాట్లాడతున్న పద్మశ్రీప్రసాద్

ఎన్నికల కోడ్‌తో ప్రత్యేక సమావేశం రద్దయిందని, ఈ సమాచారాన్ని జడ్పీటీసీ సభ్యుల గ్రూప్‌లో పెట్టామని, అయినా తమకు తెలియదని వారు చెబుతుండడం సరికాదని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. జడ్పీ క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జడ్పీటీసీలు అందరూ ప్రజా సేవ చేస్తారనే ఉద్దేశ్యంతో ప్రజలు గెలిపించారని , వారికి ప్రజా సేవ చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఇంకా రెండేళ్లు ప్రజలకు సేవ చేసుకునే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తనకు జడ్పీ చైర్ పర్సన్‌గా బి ఫారం ఇచ్చినప్పుడు కూడా అడ్డుకున్నారన్నారు. ఒక బీసీ మహిళగా తనకు అవకాశం రాకుండా చూశారని, ఇప్పుడు వారే జడ్పీటీసీలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. జడ్పీటీసీలు అందరూ.తనకు సహకారించాలని ఆమె కోరారు. వీరవాసరం జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్ నాయుడు, ఆచంట జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన శిక్షలు


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరమని, ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్ ఏలూరులోని సీహెచ్ఎస్‌డీ సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలలో సోమవారం బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల నిరోధం అశంపై విద్యార్థునులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్ళు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే సంబంధిత అధికారులకు తెలిజేయాలని సూచించారు. విద్యార్థుల లక్ష్యంగా పాఠశాలలు, కళాశాలల ప్రాంతాల్లో సంఘ విద్రోహ శక్తులు వివిధ రూపాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల అలవాటు చేస్తున్నారన్నారు. ట్రైనీ జూనియర్ సివిల్ జడ్జీలు వి.రఘునాథ్, టీఎస్ఎస్ఆర్ ఆదిత్య రిషిక్, ఏవీ నాగరాజు, కె.స్పందన, జేబీటీఎస్ దేవి, కుమారి, డి.అరుంధతి సోషల్ వర్కర్ ఎం.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

తొలిరోజు

నామినేషన్లు నిల్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు జిల్లా రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 19వ తేదీ నామినేషన్లు పరిశీలన జరుగుతుంది. ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3గంటల లోపు నామినేషన్లు ఉపసం హరించుకోవాలన్నారు. డిసెంబరు 5న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. తొలిరోజు సోమవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

ట్రైనీ అధికారుల పర్యటన



భీమవరం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శిక్షణ నిమిత్తం భీమవరం వచ్చిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ తదితర కేంద్ర సర్వీసుల శాఖ ట్రైనీ అధికారులు పట్టణంలోని పీఎస్ఎం బాలికల పాఠశాలలో విద్యా విధానంపై పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఇక్కడి విద్యావిధానంపై విద్యాశాఖాధికారలు వారికి వివరించారు. ఉదయం మెప్మాకు సంబంధించి మునిసిపల్ కార్యాలయంలో విభాగాన్ని పరిశీలించారు. మహిళలు పచ్చడి తయారీ విధానాన్ని స్వయంగా వారి ఇళ్ళకు వెళ్లి పరిశీలించారు. మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రరావు, అధికారులు ఉన్నారు.

'పది' పరీక్షలు

తెలుగులోనూ రాయొచ్చోచ్!

- ఇంగ్లీషు మీడియంలో పరీక్ష ఇక విద్యార్థి అభీష్టానికే
- జగన్ ప్రభుత్వ బలవంతపు రుద్దుడు నుంచి ఉపశమనం
- ఇప్పటికే పరీక్ష ఫీజు కట్టిన వారికి ఎడిట్ ఆప్షన్



ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను వేదిస్తోన్న మాధ్యమం (మీడియం) భయాందోళనలకు ఎట్టకేలకు తెరపడింది. టెన్త్ పరీక్షలకు ఖచ్చితంగా ఆంగ్ల మాధ్యమంలోనే రాయాల్సి ఉంటుందని వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో ఈ దఫా పరీక్షల్లో ఉత్తీర్ణత తగ్గటం ఖాయమని ఉపాధ్యాయ వర్గాలు, అంతగా పట్టులేని ఇంగ్లీషు మాధ్యమంలో పరీక్ష ఎలా రాయగలమని ఇటు విద్యార్థులు తీవ్ర ఆందోళనలోవున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో అందరికీ ఊరట కలిగించేలా విద్యా శాఖ నిర్ణయం తీసుకుంది. ఇక ఈ నిర్ణయంపై ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడటమే మిగిలిఉంది. ఆ ప్రకారం ఇప్పటికే వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న టెన్త్ పరీక్షలకు ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించేటపుడే విద్యార్థి అభీష్టాన్నిబట్టి ఇంగ్లీషు లేదా తెలుగు మీడియం ఎంచుకునే వెసులుబాటును తాజాగా కల్పించారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ వర్గాలు ధ్రువీకరించాయి. తాజా వెసులుబాటును బట్టి తెలుగు మీడియంలోనే పరీక్ష రాయదలుచుకున్న విద్యార్థులు ఇక ఎటువంటి ఆందోళనకు గురికాకుండా పరీక్షకు ప్రిపేర్ కావచ్చు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఈ దఫా సుమారు 49,500 మంది విద్యార్థులుంటారని అంచనా. ప్రస్తుతం జరుగుతున్న పరీక్ష ఫీజు చెల్లింపుల ప్రక్రియ ముగిస్తే పరీక్షార్థుల సంఖ్యపై స్పష్టత వస్తుంది. ఏలూరు జిల్లాలో సుమారు 23,500 మంది ఉండవచ్చునని తెలిసింది.

త్వరలో ఎడిట్ ఆప్షన్

ఇంగ్లీషు మీడియంలో టెన్త్ పరీక్షలు నిర్వహిస్తే ఉత్తీర్ణత అమాంతం పడిపోవడం ఖాయమని ఉపాధ్యాయ వర్గాలు ఎప్పటి నుంచో మొత్తుకుంటున్నా జగన్ ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. వాస్తవానికి ఇంగ్లీషు మీడియంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'సక్సెస్' ఉన్నత పాఠశాలల్లో మాత్రమే ఇంగ్లీషు మీడియంలో బోధన జరుగుతోంది. ఇటువంటి 'సక్సెస్' హైస్కూళ్ళు ఏలూరు జిల్లాలో 25 మాత్రమే ఉన్నాయని విద్యాశాఖవర్గాలు పేర్కొంటున్నాయి. మిగతావన్నీ తెలుగు మాధ్యమ ఉన్నత పాఠశాలలే. ఈ విషయాలను పట్టించుకోకుండానే జగన్ ప్రభుత్వం 8, 9, 10 తరగతులకు ఆంగ్ల మాధ్యమాన్ని తప్పని సరిచేస్తూ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా పాఠ్యపుస్తకాలను తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పేజీకి ఇరువైపులా ముద్రించి పంపిణీ చేసినందున పరీక్షలు రాయడానికి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఉండబోవని వైసీపీ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలను రుద్దింది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థుల సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు, బలవంతంగా విద్యార్థులపై మోపిన ఇంగ్లీషు మీడియం వల్ల జరుగనున్న అనర్థాలను గమనించింది. ఈ క్రమంలోనే వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలోనే ఖచ్చితంగా రాయాలన్న నిబంధనను సడలించి తెలుగు మాధ్యమంలో కూడా పరీక్షలు రాసేందుకు వెసులుబాటు కల్పించింది.

కాగా ఇప్పటికే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల నుంచి ఫీజును ఆన్‌లైన్ విధానంలో స్వీకరించే ప్రక్రియ జరుగుతున్నందున ఏ మాధ్యమంలో పరీక్ష రాస్తారో విద్యార్థే ఎంచుకునే అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆన్‌లైన్ విధానంలో పరీక్ష ఫీజు చెల్లించి, ఇంగ్లీషు మీడియంలో పరీక్ష రాసేందుకు అంగీకారం తెలిపిన విద్యార్థులు సైతం తాము తెలుగు మాధ్యమంలో పరీక్ష రాయదలుచుకుంటే ఆ మార్పును తెలియజేసేందుకు ఎడిట్ ఆప్షన్‌ను కొద్ది రోజుల్లో ఇవ్వనున్నారు. మరోవైపు ఫీజు చెల్లించిన విద్యార్థుల డేటాను నామినల్ రోల్స్ (ఎన్ఆర్) రూపంలో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జిల్లా విద్యా శాఖ ద్వారా ప్రభుత్వానికి అందజేసే గడువు ఇంకా ముగియనందున, ఆ లోగా ఇంగ్లీషు మీడియంను ఎంచుకుని ఇపుడు తెలుగు మాధ్యమానికి ఆప్షన్ ఇచ్చుకునేందుకు విద్యార్థులకు వెసులు బాటుతోపాటు, ఎన్ఆర్ లలో నమోదుకు అవకాశం ఉందని డీఈవో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఇదే విషయాన్ని ఉపాధ్యాయులకు సూచిస్తున్నట్టు అధికార వర్గాలు వివరించాయి. కాగా ఇంగ్లీషు స్థానే తెలుగు మాధ్యమంలో పరీక్షరాసేందుకు వెసులుబాటు కల్పిస్తూ సంబందింత అధికారిక ఉత్తర్వులు ఇంతవరకు లేవు.

యాప్‌ల్లో నష్టపోతే మూడు గంటల్లో రికవరీ

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్


మొగల్తూరు స్టేషన్ వద్ద గౌరవ వందనం సీకరిస్తున్న ఐజీ అశోక్ కుమార్

మొగల్తూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైంలో నగదు నష్టపోయిన వారు టోల్ ఫ్రీ నంబర్ 1903కి ఫిర్యాదు చేస్తే మూడు గంటల్లో ఆ నగదు ట్రాన్స్‌ఫర్ కాకుండా సహాయ పడేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్టు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవరం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి విలేకరులతో మాట్లాడారు. నష్టపోయిన బాధితుడి ఖాతాను బ్యాంకు అధికారులతో లాక్ చేయించి ఆ నగదును కోర్టు ద్వారా బాధితుడికు అప్పగిస్తామన్నారు. బెట్టింగ్ యాప్‌ల్లో విద్యార్థులు, యువకులు ఎక్కువగా నష్టపోతున్నారని తల్లిదండ్రులు వారి ఫోన్లు పరిశీలిస్తుండాలని సూచించారు. ఒడిశా రాష్ట్రం నుంచి విశాఖ మీదుగా వచ్చే గంజాయిని తరలించే ముఠాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఒడిశా, విశాఖ పోలీస్ యంత్రాంగంతో కోఆర్డినేట్ చేసుకుని గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. షీ టీమ్, మహాశక్తి టీమ్, మహిళా పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పిస్తున్నామన్నారు. రోడ్ల ప్రమాదాలు జరగకుండా ప్రయివేట్ వ్యక్తుల భాగస్వామ్యంతో నిర్దేశిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుపై దృష్టి సారించామన్నారు. ఆయన వెంట ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఏఎస్పీ ఎన్‌బీకే మురళీ కృష్ణ, సీఐ దుర్గా ప్రసాద్, ఎస్ఐలు జి.వాసు, నాగలక్ష్మి తదితరులున్నారు. ముందుగా మొగల్తూరు స్టేషన్‌కు చేరుకున్న ఆయన ప్రత్యేక పోలీస్ గైరవ వందనం స్వీకరించారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కాళ్ళ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెద అమీరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు కాళ్ళ ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన కూనపురాజు సత్యసూర్యవెంకట సుబ్బరాజు (60) ద్విచక్రవాహనంపై భీమవరం పట్టణంలోని కూతురు ఇంటికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా పెదఅమిరం పరిధిలో ఉన్న ఉండి-భీమవరం రోడ్డులో ఉన్న అశోక్ లేలాండ్ షోరం సర్వీస్ సెంటర్ వద్దకు వచ్చేసరికి రహదారి పక్కన ఆగిఉన్న కారు డోర్ షడన్‌గా తీయడంతో ద్విచక్ర వాహనానికి తగిలింది. దీనితో సుబ్బరాజు రోడ్డుపై పడ్డాడు. వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు అతని తలపై నుంచి వెళ్ళడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని అల్లుడు ఇందుకూరి గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.నాలుగు లక్షలు అపహరణ

చింతలపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండలం రేచర్ల గ్రామానికి చెందిన చెక్కా శ్రీనివాసరావు అనే వ్యాపారి రూ.నాలుగు లక్షల అపహరణకు గురైంది. స్థానిక యూనియన్ బ్యాంకు నుంచి విత్ డ్రా చేసి బయటకు వచ్చి తన మోటారు సైకిల్‌పై ఉంచగా గుర్తు తెలియని దుండగులు అపహరించారని తెలిపాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కుటుంబరావు సందర్శించి విచారణ చేపట్టారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

ఏలూరు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గొలుసు దొంగలు రెచ్చిపోతున్నారు. ఇప్పటి వరకూ ఒంటిరి మహిళలనే టార్గెట్ చేసిన ఆగంతకులు ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులపైనా తెగబడుతున్నారు. ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డు మార్గ మధ్యలో వేగవరం గ్రామ శివారులో సోమవారం జరిగింది. ఏలూరు వెన్నవల్లివారిపేటకు చెందిన దళిత నాయకులు నేతల రమేష్ బాబు ఆయన సతీమణి నిర్మలతో కలిసి ద్విచక్ర వాహనంపై సోమవారం రాత్రి దెందులూరు మండలం మసీదుపాడు నుంచి ఏలూరు వస్తుండగా గోపన్నపాలెం దాటిన తరువాత వేగవరం గ్రామశివారు కొంతదూరం వెళ్లగానే వెనుక నుంచి ఓ ద్విచక్ర వాహనంపై వచ్చిన ఆగంతకుడు ఒక్కసారిగా నిర్మల మెడలో ఉన్న 5 కాసుల బంగారు గొలుసు తెంపుకుపోయాడు. ఆమెను తోసివేశాడు. దీంతో అదుపుతప్పి రోడ్డు మీద పడి తీవ్ర గాయాలపాలైంది. గాయపడిన బాధితురాలిని ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న దెందులూరు ఎస్ఐ శివాజీ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఆగంతకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఇంటి వెనుక తలుపు తీసి..

జంగారెడ్డిగూడెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటి వెనుక తలుపు తీసి ఇంట్లో ఉన్న రూ.రెండు లక్షల 90 వేల నగదు, తొమ్మిది కాసుల బంగారు వస్తువులు దొంగిలించుకుపోయిన ఘటన సోమవారం జరిగింది. బాధితుడు కర్పూరం ఉమామహేశ్వరరావు తెలితెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉమామహేశ్వరరావు కుమారుడు రవికుమార్ పట్టణంలో బుక్‌స్టాల్ నిర్వహిస్తున్నారు. సోమవారం రవికుమార్ తిరుపతి వెళ్లారు. ఉమామహేశ్వరరావు ఇంటికి తాళం వేసి బుక్‌స్టాల్‌కు వెళ్లారు. ఉమామహేశ్వరరావు మధ్యాహ్నం భోజనానికి వచ్చే సరికి కుమారుడు రవికుమార్ తిరుపతి నుంచి వచ్చి పక్క పోర్షన్‌లో పడుకున్నారు. ఇంటి తాళం తీసిన ఉమామహేశ్వరరావుకు వెనుక డోరు తీసి ఉండడం చూసి వెంటనే అల్మరలో ఉన్న బాక్సును తెరిచి చూడగా అందులో పెట్టిన రూ.40 వేల నగదు, తొమ్మిది కాసుల బంగారు వస్తువులు కనిపించలేదు. అదే బాక్సులో ఉన్న బీరువా తాళంతో బీరువాను తీసి చూడగా అందులో పెట్టిన రూ.రెండున్నర లక్షల నగదు కనిపించకపోవడంతో తన ఇంట్లో దొంగలు పడ్డారని గుర్తించారు. వెంటనే జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

కోళ్ల ఫారం దగ్ధం

మొగల్తూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తోటకి చెందిన కవురు గోపన్నకు చెందిన నాటు కోళ్ల ఫారం ఆదివారం రాత్రి దగ్ధమైంది. కోళ్ల ఫారం దగ్ధమవుతుందని గ్రామస్థులు తనకు సమాచారం అందించడంతో వెళ్లి చూసేసరికి ఫారం పూర్తిగా దగ్ధమైందని బాధితుడు గోపన్న వాపోయాడు. సుమారు 80 కోడి పిల్లలతోపాటు పందెం కోళ్లను పెంచుతున్నానని, సుమారు రూ.4 లక్షలు నష్టం వాటిల్లిందనాడు. మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు గోపన్న తెలిపాడు.

తువ్వ మట్టి దోచేస్తున్నారు..


వివరాలు తెలుపుతున్న గోపి, కూటమి నాయకులు

యలమంచిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంతేరు గ్రామంలో ఉన్న పాలకొల్లు పట్టణానికి చెందిన జగనన్న లేఅవుట్‌లో గతంలో వేసిన తువ్వ మట్టిని అదే గ్రామానికి చెందిన ఒక వైసీపీ నాయకుడు ట్రాక్టర్లలో తరలించేశాడని స్థానికులు హౌసింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం హౌసింగ్ డీఈ ఆర్.త్రిమూర్తులు, ఏఈలు డి.రమేష్, మోహన్, సిబ్బందితో కలిసి కొంతేరు జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. లేఅవుట్‌లో ఉన్న తువ్వ మట్టిని ఆదివారం ఒక వైసీపీ నాయకుడు ట్రాక్టర్లలో (సుమారు 40 ట్రిప్పులు) తరలించేశారని స్థానికులు హౌసింగ్ అధికారులకు చెప్పారు. గతంలో పని చేసిన హౌసింగ్ ఈఈ, ఇతర అధికారులతో చెప్పి సుమారు 13 లారీల బొండు ఇసుకను లేఅవుట్ రిజర్వు సైట్‌లో వేసుకున్నానని.. ఇప్పుడు దానిని బయటకు తరలిస్తున్నానని, ఆ వైసీపీ నాయకుడు హౌసింగ్ అధికారులకు చెప్పారు. ప్రభుత్వ లే అవుట్‌లో ఉన్న మట్టిని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఈ డి.సురేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డీఈ ఆర్.త్రిమూర్తులు విలేకరులకు తెలిపారు. తువ్వ మట్టిని తరలించుకుపోయిన వైసీపీ నాయకుడిపై చట్టపరమైన చర్యలు తీకోవాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కడలి గోపాలరావు డిమాండ్ చేశారు. కొంతేరులోని జగనన్న లేఅవుట్ వద్ద సోమవారం విలేకరుల సమావేశంలో గోపాలరావు మాట్లాడుతూ మట్టిని తరలించిన వారిపై తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారని తెలిపారు. జనసేన జిల్లా నాయకుడు ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ లేఅవుట్‌లో మట్టిని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కూటమి నాయకులు చెరుకూరి అంజిబాబు, బొప్పన హరికిశోర్, పీతల శ్రీను, గంటా శ్రీను, మంచెం సత్యనారాయణ, వెన్నా సత్తిబాబు, తానంకి కృష్ణ, ఖండవల్లి నరేంద్ర, ఎ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు దాడుల్లో 115 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఆచంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో ఆచంట మండలం పుచ్చల్లంకకు చెందిన యడ్ల శ్రీనివాసరావు అనే బెల్టు షాపు నిర్వాహకుడి వద్ద నుంచి ఏడు మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐలు పి. మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

- కుక్కునూరు : వేలేరులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టుకున్నారు. మొత్తం 27 మద్యం సీసాలను అక్రమంగా అమ్ముతున్న క్రమంలో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని వేర్వేరు ప్రాంతాల్లో అరెస్టు చేసి వారి నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ కేఎస్వీ కళ్యాణ్ చక్రవర్తి సోమవారం తెలిపారు. మాధవరంనకు చెందిన బాలిన భవానీ శంకర్ నుంచి 30 మద్యం సీసాలు, అత్తిలి మండలం కంచుమర్రుకు చెందిన మరో వ్యక్తి నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సైలు పీఎస్‌డీ భోగేశ్వరరావు, బి రాజేంద్ర ప్రసాద్, మురళిమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.
- ఉంగుటూరు : భీమడోలు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కైకరం, చేబ్రోలు, నారాయణపురం, ఉంగుటూరు, గొల్లగూడెం, అక్కుపల్లి గోకవరం గ్రామాలలో దాడులు నిర్వహించారు. కైకరం, పెదవెల్లమిల్లి గ్రామాలలో ఇరువురిని అరెస్టు చేసి వారి నుంచి 32 బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని భీమడోలు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు.
- భీమడోలు : సూరప్పగూడెం ఎస్సీ కాలనీ శివారులో అక్రమంగా మద్యం అమ్ముతున్న భీమడోలు గ్రామానికి చెందిన ఎనిగళ్ల రాంబాబును అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకరరావు తెలిపారు.
- ఉండి : బెల్ట్ షాపు నిర్వహకుడిను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమాదేవి తెలిపారు. భీమవరం ఈఎస్‌టీఎఫ్ ఉండి మండలం చినపుల్లేరు పంచాయతీ పరిధిలోని తల్లమ్మచెరువులో నిర్వహించిన దాడులలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న గొల్ల ఆశీర్వాదంను అరెస్టు చేసి అతని వద్ద నుంచి తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ దాడులలో ఆకివీడు ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమాదేవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఐటీడీఏ సమీక్షా సమావేశం

బుట్టాయగూడెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని అన్నిశాఖల అధికారులతో ఈ నెల 13న పీవో పి.ధాత్రిరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అధికారులు పూర్తి సమాచారంతో సమీక్షకు హాజరు కావాలని కార్యాలయం అధికారులు తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయి సందర్శన నిర్వహిస్తారని, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

జీసీడీవోగా నవీనకుమారి

ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కార్యాలయం బాలికాభివృద్ధి అధికారి (జీసీడీవో) గా ముదినేపల్లి మండలం గోగులంపాడు జడ్పీ స్కూలు బయోలాజికల్ సైన్సు టీచరు బి.నవీనకుమారి నియమితులయ్యారు. పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కుక్కునూరు, వేలేరు, వేలేరుపాడు కేజీబీవీల పర్యవేక్షణతోపాటు, అన్ని పాఠశాలల్లో బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆమె ఏడాదికాలంపాటు ఈ డిప్యూటేషన్ పోస్టులో ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలల్లో జోనల్ స్థాయి స్పోర్ట్స్‌మీట్

ఏలూరు రూరల్/భీమడోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల జోనల్ లెవల్ గేమ్స్, స్పోర్ట్స్‌మీట్ భీమడోలు మండలం పోలసానపల్లి బీఆర్.అంబేడ్కర్ గురుకులంలో ఈనెల 14 నుంచి 17వరకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.వెంకటరమణ తెలిపారు. 14న ప్రారంభం, 17న ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఏలూరు జిల్లాతో పాటు పశ్చిమ, తూర్పు, కృష్ణాజిల్లాలోని గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఆటల పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతా యని ఆయన తెలిపారు.

టైలరింగ్‌లో మహిళలకు శిక్షణ

ఏలూరు టూటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిరుద్యోగ గ్రామీణ మహిళలకు టైలరింగ్‌లో 4 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ తెలిపారు. టైలరింగ్‌లో అడ్వాన్స్‌డ్ శిక్షణ ఇస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజనవసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 9948565256, 9014040780 నెంబర్లలో సంప్రదించాలన్నారు. సత్రంపాడులోని శిక్షణ కేంద్రానికి రావాలన్నారు. ఈ నెల 18 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఐదో తరగతి ఆపై విద్యార్హత 19 నుంచి 45 ఏళ్ల వారు అర్హులన్నారు.

నేడు అక్షరాస్యత కార్యక్రమాలు

ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యాప్రదాత చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 12న ఉమ్మడి జిల్లాలో ఆయన నెలకొల్పిన 68 విద్యాసంస్థల్లో అక్షరాస్యత కార్యక్రమాలు, శాంతిప్రదర్శనలు నిర్వహిస్తామని సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. పెదనిండ్రకొలనులోని మహాత్మాగాంధీ భవనంలో స్మృత్యంజలి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

ఐటీఐ అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్

ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రైం మినిస్టర్ ఇంటర్న్‌షిప్ స్కీం కింద ఐటీఐ పూర్తిచేసిన 21-24 ఏళ్ల వయసు వారికి 12 నెలల ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ రజిత తెలిపారు. జాతీయ అప్రెంటీస్ ప్రమోషన్ స్కీం(ఎన్ఏపీఎస్)కింద ఇప్పటికే శిక్షణ పొందిన అభ్యర్థులు అనర్హులని తెలిపారు. అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో నమోదుచేసుకోవాలని సూచించారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్‌నెంబరు 08812-230269లో సంప్రదించాలని కోరారు.

రక్తదానంతో ప్రాణదానం

పెదవేగి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రాణాలను నిలబెట్టేది రక్తదానమని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి అన్నారు. కవ్వగుంటలో సోమవార ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు దాతలు రక్తదానం చేశారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడమంటే మరొకరికి ప్రాణం పోయడమేనన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే.వరప్రసాదరావు, పీఆర్‌ఓ కేవీ.రమణ, నుగసాని గంగాధరరావు, ఘంటసాల వెంకటలక్ష్మి, భార్గర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

కుక్కునూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీతారామనగరంలో నిర్మిస్తున్న ముత్యాలమ్మ ఆలయానికి ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ రూ.లక్ష విరాళం ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు సోమవారం నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

బెల్లపు ఊట ధ్వంసం

చింతలపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిగూడెం అటవీ ప్రాంతంలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన సీతారామరాజు వద్ద 5 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్‌కు బైండోవర్ చేసినట్టు సీఐ టి.అశోక్ తెలిపారు. ఎస్ఐలు ఆర్‌వీఎల్. నరసింహారావు, అబ్దుల్‌ఖలీల్, సిబ్బంది ఉన్నారు.

చికెన్ వ్యర్థాలు స్వాధీనం

పెదపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు, పరిసర ప్రాంతాల్లో రెండు వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. రెండు వాహనాల్లో 20 వేల కిలోల చికెన్ వ్యర్థాలు స్వాధీనం చేసుకుని, వాహన యజమానులు, డ్రైవర్లు, చెరువు యజమానులపై కేసు నమోదు చేశారు. చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్లుగా ఎస్సై సతీష్ తెలిపారు.


కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మికుల ధర్నా


డీఈవోకు యూటీఎఫ్ నాయకుల వినతి


చింతలపూడిలో వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం


బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

సమస్యల హోరు

కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా.. అధికారులకు వినతి

ఏలూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమే ఇసుక ర్యాంపులు నిర్వహించాలని, భవన నిర్మాణ సంక్షేమబోర్డును పునఃప్రారంభించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం పిలుపుతో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. బుచ్చిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక ఆచరణలో అమలు కావడం లేదని విమర్శించారు. జిల్లా కార్యదర్శి చేపల్లి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, టి.బాబు, కుప్పాల కన్నబాబు, బి.శ్రీనివాసరావు, జూపూడి వసంత, పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్లకు పదోన్నతులివ్వాలి

ఏలూరు అర్బన్: మున్సిపాల్టీ పాఠశాలల్లో టీచర్లకు పదోన్నతులు షెడ్యూల్‌ను ఇంతకు ముందు ప్రకటించినవిదంగానే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం యూటీఎఫ్ జిల్లాశాఖ నాయకులు డీఈవో వెంకటలక్ష్మమ్మను కలుసుకుని వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ తాము ఇటీవల పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్(సర్వీసెస్)ను కలుసుకున్నపుడు ఈ నెల 13లోగా పదోన్నతుల కౌన్సెలింగ్ పూర్తిచేసి, ఆర్డర్ కాపీలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జారీచేస్తామని హామీ ఇచ్చారని వివరించారు. ఉమ్మడి జిల్లాలో కౌన్సెలింగ్‌ను నిర్వహించి, 70:30 నిష్పత్తిన పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. షేక్ ముస్తఫాఅలీ, శివశంకరరావు, రాజారావు, అప్పారావు, కిరణ్‌కుమార్, రామభద్రం, లక్ష్మీనారాయణ, తదితరులున్నారు.

పాఠశాల ఆయాల ధర్నా

ఏలూరు నగర, మండలపరిదిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 200 మంది శానిటరీ వర్కర్లకు (ఆయా) రావలసిన 4 నెలల పెండింగ్ గౌరవ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం డీఈవో కార్యాలయం, కలెక్టరేట్‌వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కృష్ణవేణి, దుర్గ, గౌసియా మాట్లాడుతూ ఒక్కో శానిటరీ వర్కర్‌కు నెలకు రూ.6వేలు చెల్లించాల్సి ఉందని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సోమయ్య, గోపి, జాన్‌బాబు, పూజిత, రాజు, ఆంథోని, వెంకటలక్ష్మి, సరస్వతి, ఉషారాణి, తిరుపతమ్మ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

చింతలపూడి: రైతులకు పెట్టుబడి సాయం అందజేయాలని రైతు సంఘ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు పుల్లారి సోమశేఖరాచార్యులు మాట్లాడుతూ పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాల్లో వేయాలని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, రాష్ట్రంలోని 40 వేల చెరువుల్లో పూడికలు తీసి అభివృద్ధి చేయాలని, ప్రభుత్వమే పంటల బీమా చెల్లించి రైతులకు బీమా సౌకర్యం కల్పించాలని తదితర విజ్ఞాపనలు అందచేసినట్టు తెలిపారు. ఎస్.కె.కాలేషా, రామచంద్రారెడ్డి, కంచర్ల గురవయ్య, పలువురు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ పోలవరం నియోజకవర్గ కమిటీ కార్యదర్శి కారం ధారయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు, గిరిజనులతో కలిసి ధర్నా చేశారు. ఏజెన్సీలో వందలాది ఎకరాల భూములు గిరిజనేతరుల చేతిలో ఉన్నాయని ప్రభుత్వం సమగ్ర సర్వేచేసి భూమిలేని గిరిజనులకు భూమి ఇవ్వాలని చోడెం దుర్గ అన్నారు. జేతి కిషోర్, మల్లేశ్వరావు, ముత్యాలమ్మ, వెంకటేశ్వరావు, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

భోజన పథకం కార్మికుల ఆందోళన

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ రోజుకు 7 నుంచి 8 గంటల పాటు పనిచేస్తున్నారని సకాలంలో వేతనాలు రాక అప్పులుచేసి పథకాన్ని అమలు చేయవలసిన దుస్థితి నెలకొందన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా నూతన మెను చార్జీలను పెంచాలన్నారు. చార్జీలు పెంచాక డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నూతన మెనూ అమలు చేయాలన్నారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ఎంఈవో టి.బాబురావు, నరేంద్రరాయ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనురాధ, దుర్గ, శాంతకుమారి, మరియమ్మ, సత్యవతి, సోమాలమ్మ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన మద్యం పాలసీ రద్దు చేయాలి


ప్రజాపోరు యాత్రలో సీపీఎం నాయకులు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ప్రజాపోరు యాత్ర సోమవారం నగరంలో నిర్వహించారు. వన్‌టౌన్ పడమర వీధి, వంగాయగూడెం, ఆముదాల అప్పలస్వామి కాలనీ, అరుంధతిపేట, దక్షిణపువీధి, తదితర ప్రాంతాల్లో యాత్ర సాగింది. సీపీఎం జిల్లా నాయకురాలు ఎ.శ్యామలరాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీతో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్ళెం కిశోర్, పడమర వీధి శాఖ కార్యదర్శి వై.ఎస్.కనకారావు, పి.ఆది శేషు, కె.లెనిన్, ఎస్.సత్యనారాయణ, జి.శారద, వీవీఎన్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత విధానాలను వ్యతిరేకించాలని సీపీ ఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ పిలుపు నిచ్చారు. ప్రజాపోరు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రజలను మోసం చేసే విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తున్నాయని విమ ర్శించారు. ఈనెల 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా విజయవంతం చేయాలన్నారు. అనుమోలు మురళి, మడకం కుమారి, భరగడ కుమారి, పి.మంగ, ముత్తమ్మ, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

పెదవేగి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని ఎంపీడీవో పి.శ్రీనివాస్ అన్నారు. విజయరాయి గ్రామ కార్యదర్శి వి.సౌజన్య, బాపిరాజుగూడెం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అజయ్‌కుమార్ బాస్కెట్ బాల్ జాతీయజట్టుకు ఎంపికయ్యారు. భోగాపురం సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ మెడంకి రవితేజ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. మండల పరిషత్ కార్యా లయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వారిని ఎంపీడీవో, అధికారులు అభినందించారు. ఎంపీడీవో మాట్లాడుతూ జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఒకే మండలం నుంచి ముగ్గురు ఉద్యోగులు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. క్రీడలపై ఉద్యోగులు మక్కువ చూపడం అభినందనీయమన్నారు. జాతీయస్థాయిలో మెరుగైన ప్రదర్శనతో రాణించాలన్నారు. ఈవోపీఆర్డీ షరీఫ్, గ్రామ కార్యదర్శులు బీహెచ్ ఎస్వీ. కృష్ణంరాజు, కే.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పోటీల విజేతలు

నిడమర్రు, నవంబరు 11: సర్వోదయ మండలి జిల్లా స్థాయి ఆన్‌లైన్ వ్యాసరచన, కవిత్వం, కథల పోటీలలో విజేతలను సోమవారం ప్రకటించారు. పెద నిండ్రకొలను జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఆనందిత, మద్దా డేవిడ్ లివింగ్‌స్టన్, దాసరి స్వాతి విజేతలుగా నిలిచారు. హెచ్‌ఎం టీవీ.సత్యనారాయణ తెలిపారు. గైడ్, టీచర్ జాకబ్, గోపాలకృష్ణ, మౌలాలి, భీమేష్ తదితరులు విజేతలను అభినందించారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కొయ్యలగూడెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ కొయ్యలగూడెం సెక్టార్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న నియోమి రాణి అవినీతి అక్రమాలకు పాల్పడుతు న్నారని ధ్వజమెత్తారు. ఆమెపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె అంగన్వాడీ కార్యకర్తలను, హెల్పర్స్‌ను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. దీని పై తామంతా ఉన్నతాధికారులకు పిర్యాదు చేశామని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కే.విజయలక్ష్మి, భారతి, పద్మజ, ధనలక్ష్మి, శ్రీదేవి, తదితర అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కొయ్యలగూడెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నర్సాన్నపాలెంలో ఎంపీ పుట్టా మహేష్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి కూటమి నాయకులు సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రతీ గ్రామంలో సీసీ.రోడ్ల నిర్మాణం పండుగలా జరుగుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్, జనసేన మండల అధ్యక్షుడు తోటరవి, సర్పంచ్ కాకర్ల ప్రభావతి, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం


అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళి

కామవరపుకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్, చరిత్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.విజయబాబు మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం కృషి చేయడంతోపాటు తొలి విద్యా శాఖ మంత్రిగా విద్యా విధానంలో గొప్ప సంస్కరణలు తీసుకువచ్చిన ఆజాద్ సేవలు కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, దారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, ఎం.విజయకృష్ణ, కె.ఉమా, బేబిలతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: భారతరత్న మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ విద్యాదినోత్సవం కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ అందరికీ విద్య అందాలనే అబుల్‌కలాం సంకల్పం నెరవేరిందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు కృష్ణచైతన్య, దుర్గాప్రసాద్, వెంకట్రావు, పరమేశ తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ప్రపంచ గతిని మార్చ గలిగే శక్తి ఒక్క విద్యకు మాత్రమే ఉందని ప్రిన్సిపాల్ టీకే.విశ్వేశ్వరరావు అన్నారు. నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు రెడ్డియ్యాకొండా రవి, నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: కుంతలగూడెం పాఠశాలలో జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ విద్యావికాసానికి తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలాన అబ్దుల్‌కలాం ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు ఈయన గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూళ్ళ రైస్‌మిల్లులో జాయింట్ కలెక్టర్ తనిఖీ


రైస్‌మిల్లు తనిఖీ చేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

భీమడోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పూళ్ళలోని సుబ్బరాజు రైస్ మిల్లులో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యం వివరాలు, స్టాక్ పరిశీలించారు. రైస్ మిల్లర్లు శ్రద్ధ వహించి రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం విక్రయాలు చేయాలన్నారు. రైతులు ధాన్యం వారి పేరున తరలించుకోవచ్చని, నాణ్యతా ప్రమాణాలతో కనీస మద్దతు ధరకు విక్రయించుకోవాలని జేసీ సూచించారు. జిల్లాలో 350 రైతు సేవా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు రూ.15.98 కోట్ల విలువైన 7.101 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించామన్నారు. పూళ్ళ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించామన్నారు. తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులు, మహిళల భద్రతకు అభయ రక్షణ దళం : డీఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, మహిళల భద్రత లక్ష్యంగా అభయ మహిళా రక్షణ దళం పని చేస్తుందని డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఏలూరులోని పలు ప్రాంతాల్లో మహిళా రక్షణ దళం సోమవారం పర్యటించింది. కళాశాలలు, కూడళ్లు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌ల వద్ద మహిళలు, విద్యార్థినులకు అవగాహన కల్పించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలు, నేరాలు, ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులను అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఏదైనా ఇబ్బంది ఉంటే 112 టోల్‌ఫ్రీ నెంబర్, వాట్సాప్ నెంబర్ 9550351100కు సమాచారం ఇస్తే పది నిముషాల్లో దళం ఘటనా స్థలానికి చేరుకుని నిందితులపై చర్యలు తీసుకుంటుందన్నారు.

హెల్మెట్ ధరించాలి

లింగపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వెంకన్న అన్నారు. సోమవారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మైనర్‌లకు వాహనాలను ఇవ్వకూడదని లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని అన్నారు. వాహనదారులు తప్పని సరిగా రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఆయనతో పాటు ఏఎస్ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నూరు శాతం అక్షరాస్యత సాధనకు ఉల్లాస్

జీలుగుమిల్లి, నవంబరు11 : (ఆంధ్రజ్యోతి) : నూరు శాతం అక్షరాస్యత సాధనకు ఉల్లాస్ చేపట్టినట్లు వెలుగు ఏపీఎం ఎన్.రూస్సీ తెలిపారు. స్త్రీ శక్తి భవనంలో సోమవారం మండల స్థాయి వయోజన విద్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించారు. డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామని కె.వెంకటలక్ష్మి చెప్పారు. సీసీలు, వలంటీర్లు ఉన్నారు.

● పోలవరం: వెలుగు కార్యాలయంలో వయోజన విద్య మండల స్థాయి శిక్షణ నిర్వహించారు. వయోజన విద్య జిల్లా నోడల్ ఆఫీసర్ కెవివి సత్యనారాయణ, ఎంపీడీవో ఈ.శ్రీనివాస్, సీహెచ్ బాబూరావు, జేమ్స్ పాల్గొన్నారు.






ఏలూరులో భక్తుల దీపారాధన, శివాలయాల్లో అభిషేకం, ద్వారకాతిరుమలలో శివయ్య ఊరేగింపు, ఏలూరులో ఆలయంలో భక్తుల పూజలు

శివాలయాల్లో కార్తీక పూజలు

ద్వారకాతిరుమల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల క్షేత్రంలో గంగా పార్వతీ సమేతంగా కొలువుతీరిన శివదేవుడు సోమవారం రాత్రి శేషవాహనంలో విహరించారు. కార్తీకమాస రెండో సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయంలో శివయ్యను అమ్మవార్లను శేష వాహనంలో ఉంచి ప్రత్యేక అలంకారం చేశారు. అనంతరం కొండ దిగువన తిరువీధులలో తిరుగాడారు.

● ఏలూరు కార్పొరేషన్: నగరంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చన, కార్తీక దీపారాధన చేశారు. శివాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. దక్షిణపువీధిలోని జరాపహరేశ్వరస్వామి, మార్కండేయస్వామి, అగ్రహారం నగరేశ్వరస్వామి, పాత శివాలయం, పవరుపేట కాశీ విశ్వేశ్వరాలయం, పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వరాలయం, సత్యనారాయణపేట రేవులింగేశ్వరాలయం, బావిశెట్టివారిపేట, నాగేశ్వరపురంలలోని కాశీ విశ్వేశ్వరాలయాల వద్ద, శివనగర్‌లోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం, సత్రంపాడు అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని అంబికేశ్వర స్వామి ఆలయాల వద్ద భక్తులు పూజలు, కార్తీక నోములు నోచుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సౌరశక్తి ఉపయోగించుకోవాలి

ఏలూరుసిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సౌరశక్తి వినియోగించుకోవాలని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. అమీనాపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్లాంట్‌ను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ పి సాల్మన్‌రాజు మాట్లాడుతూ వసతి గృహంలో 3కె డబ్ల్యూ సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. జేడీ వి.జయప్రకాష్, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, తహసీల్దార్ జీవీ.శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల జీవితాల్లో వెలుగు



ఏలూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అర్చకుల జీవితాల్లో వెలుగులు నింపుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా అర్చకుల వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడంపై బ్రాహ్మణసేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అర్చకులకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ప్రభుత్వ నిర్ణయం కారణంగా ఇక నుంచి ఆలయాల్లో దేదీప్యమానంగా పూజలు జరుగుతాయన్నారు. దీంతోపాటు ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించి, కమిటీల్లో బ్రాహ్మణులు, నాయిబ్రాహ్మణులకు చోటు కల్పించడంపై బ్రాహ్మణులు హర్షాతిరేఖాలు వ్యక్తం చేస్తున్నారని దుర్గాప్రసాద్ అన్నారు.

విద్యతోనే ఉన్నత స్థాయి

ఏలూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగవచ్చని జర్మనీకి చెందిన మైఖేలే అన్నారు. వైఎస్సార్‌నగర్‌లో పాఠశాలను ట్రేస్ ఇండియా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ దిడ్లా యాంజిలో ఆధ్వర్యంలో సోమవారం సందర్శించారు. విద్యార్థులకు అవసరమైన ఆట వస్తువులను అందజేశారు. విద్యార్థి దశలో కష్టపడితేనే భవిష్యత్‌లో ఉన్నతస్థానంలో ఉంటారని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జీజేఏ స్టీవెన్, ఉపాధ్యాయులు కిరణ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

భీమడోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుండుగొలను గ్రామానికి చెందిన మొగళ్ళ పాండురంగ విఠల్ కొండలరాయుడు (64) మరణానంతరం నేత్రదానం చేశారు. అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. హైదరాబాద్‌కు చెందిన అమ్మ నేత్ర అవయవ శరీరదానం ప్రోత్సాహక సంఘానికి ఆయన ముందుగానే దరఖాస్తు చేశారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల సమక్షంలో వైద్యులు, ఎల్‌వి ప్రసాద్ ఇనిస్టిట్యూట్ సిబ్బంది, నిడదవోలు రామాయమ్మ ఐ బ్యాంక్ సిబ్బంది సోమవారం కార్నియా సేకరించారు. నేత్రదానానికి అమ్మ నేత్ర అవయవ జిల్లా కోఆర్డినేటర్ సుమన్ బాబు సహకరించారు.


కల్వర్టును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

కల్వర్టు నిర్మాణానికి చర్యలు

జంగారెడ్డిగూడెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న సంత మార్కెట్ రహదారిలో కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నారు. ఆదమరిస్తే అంతే శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, కమిషనర్ కె.వెంకటరమణ స్పందించారు. సోమవారం కల్వర్టును పరిశీలించారు. కౌన్సిలర్ చిటికెల అచ్యుతరామయ్య, వైసీపీ నాయకుడు బత్తిన చిన్నా, కాంట్రాక్టర్ కొంతేటి షణ్ముఖరావు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** ఏలూరు మెడికల్ కళాశాలకు యల్లాప్రగడ సుబ్బారావు పేరును ప్రకటించటం పట్ల జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు హర్షం వ్యక్తం చేశారు.
- **ఏలూరు రూరల్ :** మాదేపల్లి శివారు లింగారావు గూడెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎస్.రంగారావు అనారోగ్యంతో మృతిచెందాడు. కొల్లేరు నాయకుడు సైదు గోవర్ధన్ మట్టిఖర్చుల నిమిత్తం రూ.10వేలు బాధిత కుటుంబానికి అందజేశారు.
- **కామవరపుకోట :** పీఆర్‌టీయూ ఉపాధ్యాయులకు అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు అన్నారు. కామవరపుకోట, తడికలపూడి, వీరిశెట్టిగూడెం, ఆడమిల్లి, పాతూరు పాఠశాలల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.
- **బుట్టాయగూడెం :** ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టాన్ని వెంటనే చేయాలని మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కుంజా వెంకటేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొత్త సింగన్నపల్లి కాలనీలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.
- **భీమడోలు :** గ్రంథాలయాల్లో విజ్ఞాన సముపార్జన ఇవ్వాలని ఎంపీడీవో సిహెచ్ పద్మావతి అన్నారు. భీమడోలు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సాయంత్రం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను ఎంపీడీవో ఆవిష్కరించారు.
- **నిడమర్రు :** పెదనిండ్రకొలనులో 108 కలశాలతో అయ్యప్ప భక్తులు చినమిల్లి నరసింహమూర్తి స్వామి ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. అనంతరం పడిపూజ కార్యక్రమం, భజన చేశారు.



రాత పూర్వకంగా తేదీ చెప్పాలని జడ్పీ సీఈవోను మీటింగ్ హాల్లో చుట్టుముట్టిన వైసీపీ జడ్పీటీసీలు

వైసీపీ జడ్పీటీసీల నిరసనలతో
హోరెత్తిన జడ్పీ

- సమావేశం రద్దయిన విషయం తమకు తెలియదన్న ప్రజాప్రతినిధులు
- మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారని జడ్పీ సీఈవోను చుటుముట్టి నిలదీత
- జడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ.. ప్రత్యేక సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి
- ఎన్నికల కోడ్ అనంతరం సమాచారం ఇచ్చి సమావేశం నిర్వహిస్తాం.. కలెక్టర్
- నిరసన విరమించిన వైసీపీ జడ్పీటీసీ సభ్యులు

ఏలూరు సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక సమావేశం ఎన్నికల కోడ్ కారణంగా రద్దయింది. అయితే ఆ విషయం తమకు తెలియ దంటూ సోమవారం వైసీపీ జడ్పీటీసీలు ఏలూరు లోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో వైసీపీ జడ్పీటీసీ ల నిరసనలతో జిల్లా పరిషత్ హోరెత్తింది. ఈ నెల 8న స్టాండింగ్ కమిటీల సమావేశం నిర్వహి ంచి, ఇప్పుడు ప్రత్యేక సమావేశానికి ఎన్నికల కోడ్ ఏమిటని పలువురు జడ్పీటీసీలు ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఇటు వంటి సమావేశాలు నిర్వహించవద్ద కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక సమావేశాన్ని రద్దు చేశామని, ఈ విషయాన్ని జడ్పీటీసీలకు సోమవారం రాత్రి తెలిపామని జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఎప్పుడు ఈ ప్రత్యేక సమా వేశం నిర్వహించేది రాత పూరకంగా తేదీ చెప్పా లని కోరారు. సమావేశ తేదీ చెప్పలేమని అన్నా రు. దీంతో జడ్పీ సీఈవో సమాధానాలు రుచించ కపోవ టంతో వైసీపీ జడ్పీటీసీలు జడ్పీ చైర్ పర్సన్‌కు వ్యతిరేకరంగా నినాదాలు చేసుకుంటూ కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి మీకోసం కార్యక్రమంలో ఉన్న కలెక్టర్ కె.వెట్రిసెల్విని కలిశారు. ఎన్నికల కోడ్ అనంతరం జిల్లా పరిషత్ ప్రత్యేక సమావే శం నిర్వహించాలని, సమావేశ సమయం ఉద యం 9 గంటలకు కాకుండా 11 గంటలకు నిర్వహించాలని వారు కోరారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పడంతో జడ్పీటీసీల నిరసన కార్యక్రమం ముగిసింది. ఈ నిరసన కార్యక్రమంలో 35 మంది జడ్పీటీసీల వరకు పాల్గొన్నారని చెబుతున్నారు.

తెలియదనడం సరికాదు
జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్

ఎన్నికల కోడ్‌తో ప్రత్యేక సమావేశం రద్దయి oదని, ఈ సమాచారాన్ని జడ్పీటీసీ సభ్యుల గ్రూప్‌లో పెట్టామని, అయినా తమకు తెలియ దని వారు చెబుతుండడం సరికాదని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. జడ్పీ క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం విలేకర్ల సమా వేశంలో ఆమె మాట్లాడుతూ జడ్పీటీసీలు అంద రూ ప్రజా సేవ చేస్తారనే ఉద్దేశంతో ప్రజలు గెలిపించారని, వారికి ప్రజా సేవ చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఇంకా రెండేళ్ల ప్రజలకు సేవ చేసుకునే అవకా శం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తనకు జడ్పీ చైర్ పర్సన్‌గా బి ఫారం ఇచ్చినప్పు డు కూడా అడ్డుకున్నారన్నారు. ఒక బీసీ మహి ళగా తనకు అవకాశం రాకుండా చూశారని, ఇప్పుడు వారే జడ్పీటీసీలను రెచ్చగొడుతున్నారని ఆరోపిం చారు. జడ్పీటీసీలు అందరూ.తనకు సహకారిం చాలని ఆమె కోరారు. వీరవాసరం జడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు, ఆచంట జడ్పీ టీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలు
తెలుగులోనూ రాయొచ్చోచ్!

- ఇంగ్లీషు మీడియంలో పరీక్ష ఇక విద్యార్థి అభీష్టానికే
- జగన్ ప్రభుత్వ బలవంతపు రుద్దుడు నుంచి ఉపశమనం
- ఇప్పటికే పరీక్ష ఫీజు కట్టిన వారికి ఎడిట్ ఆప్షన్

ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను వేదిస్తోన్న మాధ్యమం (మీడియం) భయాందోళనలకు ఎట్టకేలకు తెరపడింది. టెన్త్ పరీక్షలకు ఇచ్చితంగా ఆంగ్ల మాధ్యమంలోనే రాయాల్సి ఉంటుందని వైసీపీ ప్రభుత్వం తీసు కున్న నిర్ణయం నేపథ్యంలో ఈ దఫా పరీక్షల్లో ఉత్తీర్ణత తగ్గటం ఖాయమని ఉపాధ్యాయ వర్గా లు, అంతగా పట్టులేని ఇంగ్లీషు మాధ్యమంలో పరీక్ష ఎలా రాయగలమని ఇటు విద్యార్థులు తీవ్ర ఆందోళనలోవున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో అందరికీ ఊరట కలిగించేలా విద్యా శాఖ నిర్ణయం తీసుకుంది. ఇక ఈ నిర్ణయంపై ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడటమే మిగిలిఉంది. ఆ ప్రకారం ఇప్పటికే వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న టెన్త్ పరీక్షలకు ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించేటపుడే విద్యార్థి అభీష్టాన్నిబట్టి ఇంగ్లీషు లేదా తెలుగు మీడియం ఎంచుకునే వెసులు బాటును తాజాగా కల్పించారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ వర్గాలు ధ్రువీకరించాయి. తాజా వెసులుబాటును బట్టి తెలుగు మీడియంలోనే పరీక్ష రాయదలుచుకున్న విద్యార్థులు ఇక ఎటువంటి ఆందోళనకు గురికా కుండా పరీక్షకు ప్రిపేర్ కావచ్చు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఈ దఫా సుమారు 49,500 మంది విద్యార్థులుంటారని అంచనా. ప్రస్తుతం జరుగుతున్న పరీక్ష ఫీజు చెల్లింపుల ప్రక్రియ ముగిస్తే పరీక్షార్థుల సంఖ్య పై స్పష్టత వస్తుంది. ఏలూరు జిల్లాలో సుమారు 23,500 మంది ఉండవచ్చునని తెలిసింది.

త్వరలో ఎడిట్ ఆప్షన్

ఇంగ్లీషు మీడియంలో టెన్త్ పరీక్షలు నిర్వహి స్తే ఉత్తీర్ణత అమాంతం పడిపోవడం ఖాయ మని ఉపాధ్యాయ వర్గాలు ఎప్పటి నుంచో మొ త్తుకుంటున్నా జగన్ ప్రభుత్వం మొండిగా వ్యవ హరించింది. వాస్తవానికి ఇంగ్లీషు మీడియంతో ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన 'సక్సెస్' ఉన్నత పాఠశా లల్లో మాత్రమే ఇంగ్లీషు మీడియంలో బోధన జరుగుతోంది. ఇటువంటి 'సక్సెస్' హైస్కూళ్ళు ఏలూరు జిల్లాలో 25 మాత్ర మే ఉన్నాయని విద్యాశాఖవర్గాలు పేర్కొంటున్నాయి. మిగతా వన్నీ తెలుగు మాధ్యమ ఉన్నత పాఠశాలలే. ఈ విషయాలను పట్టించుకో కుండానే జగన్ ప్రభుత్వం 8, 9, 10 తరగతు లకు ఆంగ్ల మాధ్య మాన్ని తప్పని సరిచేస్తూ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా పాఠ్యపుస్తకాలను తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పేజీకి ఇరువైపులా ముద్రించి పంపిణీ చేసినం దున పరీక్షలు రాయడానికి విద్యార్థులకు ఎటు వంటి ఇబ్బందులు ఉండబో వని వైసీపీ ప్రభు త్వం ఏకపక్ష నిర్ణయాలను రుద్దింది. ఈ నేపథ్యం లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థుల సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకో వడంతోపాటు, బలవంతంగా విద్యార్థులపై మో పిన ఇంగ్లీషు మీడియం వల్ల జరుగనున్న అనర్థాలను గమనించింది. ఈ క్రమంలోనే వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆంగ్ల మాధ్య మంలోనే ఇచ్చితంగా రాయాలన్న నిబంధనను సడలించి తెలుగు మాధ్యమంలో కూడా పరీక్షలు రాసేందుకు వెసులుబాటు కల్పించింది.

కాగా ఇప్పటికే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల నుంచి ఫీజును ఆన్‌లైన్ విధానంలో స్వీకరించే ప్రక్రియ జరుగుతున్నందున ఏ మాధ్యమంలో పరీక్ష రాస్తారో విద్యార్థే ఎంచుకునే అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆన్‌లైన్ విధానంలో పరీక్ష ఫీజు చెల్లించి, ఇంగ్లీషు మీడియంలో పరీక్ష రాసేందుకు అంగీకారం తెలిపిన విద్యార్థులు సైతం తాము తెలుగు మాధ్యమంలో పరీక్ష రాయదలుచుకుంటే ఆ మార్పును తెలియజే సేందుకు ఎడిట్ ఆప్షన్‌ను కొద్ది రోజుల్లో ఇవ్వను న్నారు. మరోవైపు ఫీజు చెల్లించిన విద్యార్థుల డేటాను నామినల్ రోల్స్ (ఎన్‌ఆర్) రూపంలో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జిల్లా విద్యా శాఖ ద్వారా ప్రభుత్వానికి అందజేసే గడువు ఇంకా ముగియనందున, ఆ లోగా ఇంగ్లీషు మీడియంను ఎంచుకుని ఇపుడు తెలు గు మాధ్యమానికి ఆప్షన్ ఇచ్చుకునేందుకు విద్యా ర్థులకు వెసులు బాటుతోపాటు, ఎన్‌ఆర్ లలో నమోదుకు అవకాశం ఉందని డీఈవో కార్యాల య వర్గాలు వెల్లడించాయి. ఇదే విషయాన్ని ఉపాధ్యాయులకు సూచిస్తున్నట్టు అధికార వర్గాలు వివరించాయి. కాగా ఇంగ్లీషు స్థానే తెలుగు మాధ్యమంలో పరీక్షరాసేందుకు వెసులు బాటు కల్పిస్తూ సంబందింత అధికారిక ఉత్తర్వులు ఇంతవరకు లేవు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ

ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా లోని 650 మంది ఎన్‌సీసీ కేడెట్లకు ఈ నెల 12 నుంచి 21 వరకు నల్లజర్లలోని ఏకేఆర్‌జీ ఉన్న త పాఠశాల మైదానంలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు 19 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలి యన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే తెలిపారు. 2026లో ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఉమ్మడి జిల్లా నుంచి కెడెట్ల ప్రాబ బుల్స్‌ను ఎంపికచేయడంతోపాటు, వివిధ రకాల శిక్షణలు ఇస్తామని వివరించారు. వచ్చే ఏడాది జరుగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు ఎన్‌సీసీ కెడెట్లు ఎంపికయ్యా రని, హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తున్నారన్నారు.

సాగునీటి సంఘాలు ఖరారు

- ముదినేపల్లి మండలంలో రెండు డీసీలు, 16 సంఘాలు
- కలెక్టర్ ఉత్తర్వులు జారీ

ముదినేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగునీటి వినియోగదారుల సం ఘాలు ఖరారయ్యాయి. కృష్ణా తూర్పు డెల్టాలోని పోల్ రాజ్, క్యాంప్ బెల్, గుడివాడ, బంటుమిల్లి ఇరిగేషన్ ఛానల్స్ పరిధిలో ఆయకట్టు వారీగా ముదినేపల్లి, వడాలి, బంటుమిల్లి సెక్షన్ల పరిధిలో 16 సాగునీటి సంఘాలను ఏర్పాటు చేస్తూ కలె క్టర్ వెట్రిసెల్వి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోల్‌రాజ్ కెనాల్ పరిధిలో ముదినేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఏర్పడింది. దీని పరిధిలో నెంబరు-68 విన్నకోట, నెం-69 విన్నకోట, గురజ, దాకరం, కానుకొల్లు, లింగాల, గన్నవరం, పెరికి గూడెం సంఘాలు, క్యాంప్‌బెల్ కెనాల్, పెదగొ న్నూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో చేవూరు, పెదగొన్నూరు, కోమర్రు, బొమ్మినంపాడు, ప్రొద్దు వాక, వైవాక సంఘాలు, బంటుమిల్లి ఛానల్‌కు కమలాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో వా డవల్లి, వణుదుర్రు సంఘాలు ఏర్పాటయ్యాయి.

సచివాలయాల్లో ఓటర్ల జాబితాలు

కైకలూరు : నీటి సంఘాల ఓటర్ల లిస్టుల పబ్లికేషన్ పూర్తయినట్టు కైకలూరు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం తెలిపారు. ఓటర్ల లిస్టులను ఆయా గ్రామ సచివాలయాల్లో నోటీసు బోర్డుల్లో ఉంచామని, రైతులు వాటిని పరిశీలించి మంగళవారం సాయంత్రంలోగా నాటికి అభ్యంత రాలను సవరణ చేయించుకోవాలన్నారు. కైక లూరు పరిధిలో కైకలూరు, పెరికేగూడెం, భైరవ ఎట్నం, పల్లెవాడ, తామరకొల్లు, దొడ్డిపట్ల, గోపవరం, నీటి సంఘాలు ఉన్నాయన్నారు

అభివృద్ధికి బాట రాష్ట్ర బడ్జెట్ : మంత్రి పార్థసారథి

నూజివీడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చెల్లించాల్సిన 1.35లక్షల కోట్ల బకాయి లను చెల్లిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేలా 2.94లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని మంత్రి కొలుసు పార్థ సారథి అన్నారు. నూజివీడు మండలం రావిచర్ల లో సుమారు రూ.30లక్షలతో రహదారి నిర్మాణా నికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం జరిగింద న్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి సారథి

వైసీపీ నాయకుల వాదన ఆశ్చర్యకరమని మంత్రి పార్థసారథి అన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు కనుక అసెంబ్లీకి రాను అనేలా జగన్ మాట్లాడటం ఆశ్చర్యకరమన్నారు. గత వైసీపీ పాలనలో టీడీపీ నుంచి మరో నలుగురు ఎమ్మె ల్యేలను లాగేస్తే అసలు ప్రతిపక్ష హోదానే ఉండ దని, ఆ నాయకుడు మాట్లాడిన మాటలు ఆయ నకే గుర్తు రాకపోవడం ఆశ్చర్యకరమన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేలా ప్రభుత్వం గృహనిర్మాణ శాఖకు నిధులను మం జూరు చేశారన్నారు. త్వరలో టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, ఎంపీటీసీ మరీదు శివనాగమణి, ఎనిగళ్ళ సాంబశివరావు, లావు ప్రసాద్, జనసేన నాయకులు మరీదు శివరామకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో వాణి

భూ సంబంధ వ్యవహారాలపై అర్జీలు

నూజివీడు టౌన్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): రెవెన్యూ రికార్డుల్లో పేర్లు చేర్చాల్సిం దిగా కోరుతూ సోమవారం ప్రధానంగా అర్జీలు దాఖలు అయ్యాయి. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ఎం.వాణి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిం చారు. నర్సుపేట నుంచి బాణావతు కొండమ్మ, బాణావతు లక్ష్మి, బాణావతు తిరుపతమ్మ రెవెన్యూ రికార్డుల్లో పేరు నమోదు చేయాలని వినతిపత్రం అందించారు. ఆగిరిపల్లి మండ లం చొప్పరమెట్ల గ్రామానికి చెందిన సామ్రా జ్యమ్మ మరుగుదొడ్ల బిల్లులు ఇప్పించాల్సిందిగా వినతిపత్రం అందించారు. మొత్తం 14 అర్జీలు దాఖలైనట్లు ఆర్డీవో తెలిపారు.



శోభనాచలుని వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆగిరిపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శోభనాచల వ్యాఘ్రలక్ష్మి నరసింహస్వామి వారి క బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమ య్యాయి. ఈనెల 16వరకు జరుగుతాయని ప్రధాన అర్చకుడు వేదాంతం శేషుబాబు తెలిపారు. 16న పుష్పయాగం పావరింప సేవలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈవో సీహెచ్.సాయి తెలిపారు.

24 గంటల పాటు భజన

కైకలూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కైకలూరులో సర్వనామ సంకీర్తన ఏకాహ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. సోమవారం కైకలూరు మద్దివిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవింద మాంబ ఆల య ప్రాంగణంలో 24 గంటల పాటు భజన కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 6.05 నిమిషాలకు ప్రారంభించగా మంగళవారం ఉదయం 6.05 నిమిషాల వరకు భజన చేస్తారు. వీరబ్రహ్మం భక్త సమాజం, టీకే జయచారి, అనుబోజు భాస్కరరావు, టీకే వెంకటసత్యనారాయణ, తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బూరుబోయిన

కైకలూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆచవరం గ్రామానికి చెందిన బూరుబోయిన శ్రీనివాసరావును నియమిం చారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఇటీవల శ్రీశైలంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు అందజేశారు.

రక్షణ కల్పించాలంటూ ఫిర్యాదు

ముదినేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒంటరి మహిళగా జీవిస్తున్న తనకు రక్షణ కల్పించి తనను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ జిల్లా పోలీసు అధికారులను కోరింది. తన గ్రామానికే చెందిన కొందరు తనను వేధిస్తూ, తనపై అత్యాచారయత్నానికి ప్రయత్నించారంటూ సోమవారం ఏలూరులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏఎస్పీ సూర్య చంద్రరావుకు ఫిర్యాదు అంద జేసింది. ఈనెల 5న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని వాపో యింది. తనకు రక్షణ కల్పించాలని కోరింది.

జనరేటర్ వినియోగంలోకి తెస్తాం

ముసునూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో నిరుపయోగంగా జనరేటర్ - పట్టించుకోని రెవిన్యూ అధికారులు శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురిత మైన కథనంపై తహసీల్దార్ రాజ్‌కుమార్ స్పందించారు. సత్వరమే వినియోగంలోకి తీసుకువచ్చి, రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి, ప్రజలకు ఇబ్బంది లేకుండా సకాలంలో సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి వివరణ ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

వాతావరణంలో మార్పులతో ఆందోళన



పొలాల్లో కోత కోసిన వరి పనలు

కలిదిండి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం తో వాతావరణంలో మార్పులతో ఆకాశం మేఘా వృతం ఉండటంతో చేతికి వచ్చిన వరి పంట దక్కుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందు తున్నారు. కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాల పురం, వెంకటాపురం గ్రామాల్లో వరి పొలాలు పంట దశలో ఉన్నాయి. వరి కోతలకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో భారీ వర్షాలు కురిస్తే వరి పైరు నేలకొరిగి నీటి పాలై ప్రమాదం ఉందని రైతులు దిగాలు పడుతున్నా రు. ఎకరానికి సుమారు రూ.30 వేలు పెట్టుబడి పెట్టారు. సుమారు 3 వేల ఎకరాలు పంట దశలో ఉంది. కొంతమంది రైతులు యంత్రాలతో వరి కోతలను ప్రారంభించారు. ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెడుతున్నారు. రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో రైతులకు కంటి మీద కునుకు ఉండడం లేదు. రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ కొరత నివారణకు నిరంతరాయంగా ఏరియేటర్లు తిప్పుతున్నారు.

వ్యవసాయ విద్యుత్‌కు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

ముసునూరు, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీట ర్లు బిగించే ప్రక్రియను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి రాయంకుల లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సోమవారం రైతుల సమస్యలపై ముసునూరు తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతపత్రం అందజేశారు. రైతులకు పంట పెట్టుబడి సాయం ఈ నెలలో అందించాలని, వరికి గిట్టుబాటు ధర ప్రకటించి, అన్ని సొసైటీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కూచిపూడి నాగేశ్వరరావు, చెంగల వెంకటేశ్వర రావు, మధు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతపత్రం ఇస్తున్న రైతు సంఘం నేతలు

పంటరుణాలు ఇవ్వాలి

రిజర్వ్‌బ్యాంక్ ఉత్తర్వుల మేరకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు పంట రుణాలు ఇవ్వాలని రాష్ట్ర రైతుసంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ నరసింహ కోరారు. సోమవారం అక్కిరెడ్డిగూడెం ఎస్‌బిఐ మేనేజర్ ప్రవీణ్ కుమార్‌కు రైతులు, రైతుసంఘం నాయకులు సంయుక్తంగా వినతపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యాదర్శి రాయంకుల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి

చాట్రాయి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కూట మి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం రూ 20 వేలు విడు దల చెయ్యాలని కోరుతూ తహసీల్దార్ ప్రశాంతి కి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్య దర్శి కొమ్ము ఆనందం వినతిపత్రం అందజేశారు. రబీ సీజన్‌లో పెట్టుబడి సాయం అందిస్తే అన్నదాతలకు ఊరట లభిస్తుందన్నారు.

నూజివీడు టౌన్: రైతులకు పంట పెట్టుబడి సాయం అందించాలని కోరుతూ తహసీల్దార్‌కు రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందిం చారు. రబీలో రైతులకు పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర రాష్ట్ర విధానాలపై పోరు

ఆగిరిపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలు నిరసనగా ఈనెల 14న సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని సీపీఎం నేత జి.రాజు కోరారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా సోమవారం ఆగిరిపల్లిలో కరపత్రాలు పంపిణీ చేసి గోడ పత్రికను ఆవిష్కరించారు. సిహెచ్ శివనాగరాజు, సభ్యులు జె.గోపాలరావు, ఎం.నరేష్, ఎస్. కోటేశ్వరరావు, ఎన్.ఉలక్కయ్య, పి.సుధాకర్‌రావు, స్టాలిన్ పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యం

చాట్రాయి, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): రైతులకు మద్దతు ధర అందించ డమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వ్యవసా యాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. చిన్నంపేట రైతు సేవా కేంద్రాన్ని సోమ వారం ఆయన సందర్శించారు. రైతుల సమావేశంలో మాట్లాడుతూ మండలం లో 800 మెట్రిక్ టన్నుల ధాన్యం కొను గోలు చేశామన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవో శివశంకర్ సిబ్బంది, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బాషా

● ముసునూరు: ధాన్యం కొనుగోలు కేంద్రా ల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని ఏవో ఎస్.మధుమోహన్ అన్నారు. సోమవారం చింతలవల్లి రైతుసేవా కేంద్రంలో ధాన్యం విక్రయాల గోనె సంచులను సిద్ధం చేశారు. రైతులు ఆర్‌ఎస్‌కే సిబ్బందిని సంప్రదిం చాలన్నారు. తేమ శాతం 17 కంటే తక్కువ ఉన్న రైతులకు సంచులు ఇవ్వడం జరుగుతుంద న్నారు. ఇబ్బందులు ఎదురైతే 8331056844 నెంబరును సంప్రదించాలని ఏవో కోరారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

కలిదిండి / ముదినేపల్లి/మండవల్లి, నవం బరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో పంచబుగ్గల కోనేరులో తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, పూజలు చేశారు. కోరుకొల్లు సోమేశ్వరస్వామి ఆలయం, పెదలంక నాగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముదినేపల్లి మండలం అల్లూరు సోమేశ్వరస్వామి దేవస్థానంలో, గురజ రామలింగేశ్వరస్వామి, సింగరాయపాలెం అమృతేశ్వర స్వామి, పెదగొన్నూరు మల్లేశ్వరస్వామి దేవస్థానాల్లో పూజలు, అభిషేకాలు జరిపారు. మండవల్లి మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మండవల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామిని దర్శించుకుని కార్తీక దీపాలు వెలిగించారు. హరహర శివశివ అంటూ శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం భక్తిభావం వెల్లివిరిసింది.



కలిదిండిలో స్వామికి పూజలు, బలివే రామలింగేశ్వరుడు

బలివే ఆలయంలో పూజలు

ముసునూరు: బలివే రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అర్చకులు తోలేటి అరుణభాస్కరరావు ఆధ్వర్యం లో తెల్లవారుజాము నుంచి స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశా రు. భక్తులు స్వామివారిని దర్శించు కుని, కార్తీక దీపారాధన చేశారు. ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య పర్యవేక్షణలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. గోపవరం కాశీ విశ్వేశ్వరాలయం, చింతలవల్లి పార్వతి సమేత రామలింగేశ్వరుడి ఆలయం, చెక్కపల్లి సాంబ శివుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం ధర్నా

కలిదిండి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ విరుద్ధమైన జమిలి ఎన్నికలను విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ప్రజా పోరుయాత్రలో భాగంగా కలిదిండిలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ప్రజలపై వేస్తున్న పన్ను భారాలను ఉపసంహరించుకోవాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, నాయకులు రఘురామ్, జక్కుల మహేష్, కె.శ్రీనివాసరావు, డి.సత్యనారాయణ, శ్రీకాంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ముదినేపల్లి, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): శ్రీహరిపురం పంచాయతీ పరిధిలోని అయినంపూడి గ్రామంలో పల్లె పండుగలో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. సర్పం చ్ పరసా విశ్వేశ్వరరావు భూమి పూజ చే0సి పనులను ప్రారంభించారు. పంచా యతీ పాలక వర్గ సభ్యురాలు బొర్రా లక్ష్మీ కుమారి, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం రాజేంద్ర ప్రసాద్

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

ముదినేపల్లి, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): జాతీయ విద్యాదినోత్సవాన్ని సోమ వారం ముదినేపల్లి మండలం పెయ్యేరు ఎలిమెంటరీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎఫ్ఏ-1 పరీక్షల్లో ఒకటి నుంచి ఐదు తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించి విద్యాసామర్థ్యాన్ని చూపించిన పది మంది విద్యార్థులకు ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి, పాఠశాల హెచ్ఎం బేతాళ రాజేంద్ర ప్రసాద్ బహుమతులు, మెమొంటోలు అందజేశారు. ఎస్ఎంసీ చైర్మన్ మున్నీసా, ఉపాధ్యాయుడు చింతల చక్రధర్ పాల్గొన్నారు.



గురుమూర్తిని అభినందిస్తున్న నాయకులు

గౌడ కార్పొరేషన్ చైర్మన్‌ను అభినందించిన నాయకులు

చాట్రాయి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితు లైన వీరంకి గురుమూర్తిని సోమవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో చాట్రాయి మండల టీడీపీ గౌడ నాయకులు కలిసి అభినందించారు. గురుమూర్తి సార ధ్యంలో గౌడ జాతి ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చెందుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కందుల కృష్ణ, పలగాని దుర్గారావు, మండల పానుగళ్ళ కోటేశ్వరరావు, మరీదు శ్రీను, చెన్నారావు గురుమూర్తిని అభినందించారు.

యోగాలో ఆరితేరారు

ఆగిరిపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వ ర్యంలో యోగా తరగతుల్లో కొందరు రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో బహుమతులు దక్కించుకున్నారు. యోగా గురువులు వెం కట అప్పారావు, జ్యోతికుమారికి డాక్టర్ డి.రజిత అభినందనలు తెలిపారు. ఏడుగు రికి 8నుంచి 14 వయస్సు అంశంలో బహుమతులు వచ్చినట్లు తెలిపారు.

సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన

నూజివీడుటౌన్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): నూజివీడు ఆర్డీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి చేసిన సేంద్రియ ఉత్పత్తులను ప్రదర్శించారు. రసాయన రహిత ఉత్పత్తులను పొందవ చ్చని విజయకుమారి పేర్కొన్నారు.

అబుల్ కలామ్ అజాద్ జయంతి

చాట్రాయి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో సోమవారం మౌలానా అబుల్ కలామ్ అజా ద్ జయంతి నిర్వహించారు. ఉపాధ్యాయు డు వెంకట్రావు, విద్యార్థులు మౌలానా చిత్ర పటానికి నివాళులర్పించారు. హెచ్ఎం వెంక ట్రావు విద్యార్థులకు వివరించారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

చాట్రాయి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోటపాడులో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం రాత్రి దాడిచేసి ముగ్గురిని అ దుపులోకి తీసుకొన్నారు. రూ.5 వేలు నగదు, ఒక బైక్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

నూజివీడు టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యాన్ని సేవిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.